# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక

2009



## నీతిమంతుల నివాసస్థలమును యెహోవా ఆశీర్వదించును.

సామెతలు 3:33

1976 - 2008 32 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక

*The largest circulated Telugu monthly since 32 years*

డిసెంబరు 2008 సంపుటి 32 సంచిక 12

వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు:
ఆచార్య ఆరార్కె మూర్తి
ప్రచురణకర్త, సంపాదకులు:
డా॥ దేవసహాయం దండల
సహకారం:
పాస్టర్ పి. సురేశ్ బాబు
సంపాదక వర్గం:
బ్రదర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం,
బ్రదర్ ఎన్. దేవానంద్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్
సహాయ సంపాదకులు:
బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్ అబ్రహాం

## ఈ సంచికలో

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| మనలోమాట | 5 |
| క్రిస్మస్ ప్రభువు | 6 |
| క్రిస్మస్ కాంతి | 9 |
| ప్రమోదంలో ప్రమాదం | 13 |
| క్రిస్మస్ శుభవేళలో | 15 |
| క్లుప్త ప్రసంగాలు | 16 |
| ఇమ్మానుయేలు | 17 |
| క్రిస్మస్ | 19 |
| కీర్తన | 21 |
| నిర్గమకాండం | 23 |
| సద్గురువు | 25 |
| గళ్ళనుడికట్టు | 28 |

### చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాలకు |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 100 | $ 20 |
| జీవిత సభ్యత్వం | రూ. 1000 | $150 |
| పోషక సభ్యత్వం | రూ. 100 (ప్రతినెల) | $2 0 |

పత్రిక చందాకు మించి పరిచర్య అభివృద్ధి కోసం కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన SPANDANA పేరు మీద ఈ క్రింది అడ్రస్‌కు పంపాలి.

**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
పోస్టు బాక్స్: 415, గార్లపాటివారి వీధి,
దుర్గాగ్రహారం, విజయవాడ - 520 002, ఫోన్ : 2456547,
E-mail: read_spandana@yahoo.com

Founder & Chief Editor : **Acharya R.R.K.Murthy**

Printed, Published and owned by
DEVASAHAYAM DANDALA
Printed at Spandana Offset Printers, Suryaroapet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.

## స్పందన ఆత్మీయ కుటుంబ సభ్యులందరికీ క్రిస్మసు, నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఆచార్యఆరార్కె - డా॥ దేవ

# స్పందన - ప్రతిస్పందన



## నూతన పరుస్తున్నాయి

స్పందన పత్రికవారికి శుభవందనములు. గళ్ళ నుడికట్టు, ఆరార్కేగారి ప్రత్యేక వ్యాసాలు, రేడియో పాఠాలు, మిగిలిన ప్రసంగాలు మమ్ములను నూతన పరుస్తున్నాయి. పత్రిక మిగుల అభివృద్ధి కావాలని ఆశిస్తూ ప్రార్థిస్తున్నాము.

*రెవ. డానియల్ జంపా, విజయవాడ*

## ఎంతో మేలు పొందుచున్నాము.

దైవజనులైన ఆరార్కేమూర్తిగారికి, దేవసహాయంగారికి మా వందనములు చెప్పుచున్నాము. శుభవార్త ఛానల్‌లో వస్తున్న మీ వాక్యోపదేశములను ప్రతిరోజు వింటున్నాము. ఆధ్యాత్మికముగా మా కుటుంబము ఎంతో మేలు పొందుచున్నది.

*హెచ్.ఎస్. దివాకరు, తాండూరు*

## ఆదరణ కలిగిస్తున్నది

ఆరార్కేమూర్తిగారికి నమస్కారములు. మీ స్పందన పత్రిక చాలా బాగుంది. ఆధ్యాత్మికంగా ఉండి మాకెంతో ఆదరణ కలిగిస్తుంది. శుభవార్తలో వస్తున్న మీ ప్రసంగాలు సంకీర్తన ప్రోగ్రామ్ చాల బాగుంది.

*యం. సౌజన్య, కృష్ణాజిల్లా*

## ఎన్నోవిషయాలు

ప్రియమైన దేవసహాయం అన్నకు క్రీస్తు నామములో వందనములు తెలియజేస్తూ వ్రాయుట. మీ స్పందన పత్రికను ఒక స్థలములో చదివాను. వాటిలో ఎన్నో విషయాలు నా ఆత్మీయ స్థితి ఎదుగుదలకు ఉపయోగపడినాయి. కనుక మేము ఆ పత్రిక పొందగోరుచున్నాము.

*కె. రాజేష్‌కుమార్, విజయవాడ*

## చాలా బాగుంటున్నాయి

గౌరవనీయులైన దేవసహాయం అన్నయ్యగార్కి సోదరి నమస్కరించి వ్రాయునది. అన్నయ్య మీ సందేశాలు, మూర్తి అంకుల్ గారి సందేశాలు స్పందన పత్రికలో చదువుచున్నాము. చాలా బాగుంటున్నాయి. మీ యిరువురు మాకు సంతానము కొరకు ప్రార్థించ గలరు.

*సునీత, హైదారబాద్*

## ఆధ్యాత్మిక ఎదుగుదల

మా ప్రియులు దైవజనులు. డా॥ దేవసహాయంగార్కి వందనములు. మీరు ప్రచురిస్తున్న స్పందన మాసపత్రిక గత రెండుసంవత్సరములనుండి చదువుతూ ఎంతో ఆధ్యాత్మికంగా ఎదుగుచున్నాము, బలపడుచున్నాము.

*సోమేశ్వరరావు, గుడివాడ*

## సహాయపడుతుంది

దైవజనులు ఆచార్య ఆరార్కేమూర్తిగారికి, దేవసహాయం అయ్యగార్లకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో శుభాబివందనములు. నేను మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ నందు గల తెలుగువారి మధ్య సేవ చేస్తున్నాను. నేనీ మధ్యకాలంలో హైదారబాద్ వచ్చినపుడు మా బంధువుల ఇంట్లో మీ స్పందన పత్రిక జూన్ 2002 కాపిని చదివాను. ఎంతో ఆశీర్వాదకరంగాను, దీవెనకరంగాను, ఆత్మీయంగా ఎంతో బలపడడానికి సహాయపడుతుంది. దయచేసి మీ పత్రికను నాకు పంపగలరు. మీ యొక్క రేడియో ప్రసంగాలను క్రమం తప్పకుండా వింటుంటాను.

*పాస్టర్. యస్. కవిరాజ్, జబల్‌పూర్*

# సంపాదకీయం...

**క్రిస్మస్** యేసు గుణాతిశయములను ధ్యానించే సమయం, ప్రకటించే సమయం. యెషయా ప్రవక్త 9:6,7 లో యేసుక్రీస్తును ప్రవచనాత్మకంగా వర్ణించాడు. "మనకు శిశువు పుట్టాడు. కుమారుడు అనుగ్రహించబడ్డాడు. ఆయన భుజం మీద రాజ్యభారం ఉంటుంది. ఆశ్చర్యకరుడు...." క్రీస్తు పుట్టక మునుపు 740 సం॥రాల క్రిందట యెషయా ఆశ్చర్యకరుడైన యేసును చూచాడు. ప్రవచించాడు. యేసు అందరిలో అతి ఆశ్చర్యకరుడు. పాత నిబంధనలోని భక్తులందరికంటే, కొత్త నిబంధనలోని వ్యక్తులందరి కంటే యేసు ఆశ్చర్యకరుడు. మరియ గాబ్రియేలు ద్వారా వార్త విన్నది. తను దయాప్రాప్తురాలు. సర్వోన్నతుడు ఆమె గర్భవాసాన పుట్టబోతున్నాడు. ఆమెకీ వార్త ఆశ్చర్యమనిపించింది. పరిశుద్ధాత్మ శక్తి వల్ల దేవుడు శిశువై ఆశ్చర్యకరమైన రీతిగా అవతరించాడు. మరియకు అర్థం కాలేదు. కాని ఈ ప్రవచనాన్ని నమ్మింది. యేసు పుట్టేవరకు మరియకు, యోసేపుకు వైవాహిక సంబంధం లేదు. దేవుని కాల నిర్ణయం ప్రకారం మరియ యేసును కన్నది. పశులపాకలో యేసు పుట్టాడు. దేవుడు యేసుక్రీస్తుగా ఈ లోకాన్ని దర్శించాడు. అపవాది యొక్క క్రియలను లయపరచటానికే మనుష్య కుమారుడైన యేసు ప్రత్యక్షమయ్యాడు. మొదటిసారి రాకడలో యేసు సైతాను క్రియలను లయపరుస్తున్నాడు. అదే సమయంలో కాపరులకు యేసు పుట్టాడని దేవదూతలు వార్త అందించారు. పరలోక గాయకులు పాటలు పాడారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని పాటల రూపంలో ప్రకటించారు. కాపరులు తిరిగి తమ మందలను కాచుకునేందుకు వెళ్ళిపోయారు. దేవుణ్ని స్తుతించారు. వారిలో ఒక సంతృప్తి, శుభనిరీక్షణ కలిగాయి. తాము అనుదినం చేస్తున్న పనే చేస్తున్నారు, కాని పనిలో నాణ్యత పెరిగింది. నమ్మకమైన పని, నిజాయితీగా చేయటానికి **క్రిస్మస్** వారిలో ప్రేరణను ఉత్పత్తి చేసింది. ఇతరులతో తమ అనుభవాలను పంచుకుంటున్నారు. **క్రిస్మస్** అనుభూతి వారిలో చెప్పశక్యము గాని ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని కలిగించింది. మానవ తండ్రి లేకుండా ఏ శిశువూ పుట్టడు. దేవుడే యేసుకు తండ్రి, మరియ తల్లి. కన్యక గర్భధారణ ఆశ్చర్యం, పుట్టుక మరీ ఆశ్చర్యం. 'పరలోకంలో తండ్రి ప్రక్కన కూర్చుండిన యేసుకు తల్లి లేదు. పశువులపాకలో మరియ చేతిలో పొత్తిగుడ్డలో పడుకున్న యేసుకు తండ్రి లేడు.' ఇది ఆశ్చర్యం ఆత్యాశ్చర్యం. యేసు దేవుడు, మానవుడు కూడా. ఆయనకు తండ్రి దేవుడే. తల్లి మానవమాత్రురాలు. క్రీస్తులో దేవ,మానవ స్వభావాలు రెండూ ఉన్నాయి. యేసు మనకు రక్షకుడు. మనకూ దేవునికి మధ్యవర్తి. దేవుని ఎదుట మనకు ఉత్తరవాది. గనుక ఆయన దేవుడే. అంతే కాదు మనకు స్నేహితుడు. సృష్టికర్త మనకు రక్షకుడయ్యాడు. యేసు పరలోకం నుండి వచ్చినవాడు. ఇహలోక సమస్యలకు పరలోక పరిష్కారమివ్వటానికి ఆయన దివి నుండి భువికి దిగివచ్చాడు. దేవుని రాజ్యానికి మనలను సిద్ధపరచే జీవము పై నుండి వచ్చినది. ప్రజలు తమ జీవితాలలోనికి రాజును స్వాగతించాలి, స్వీకరించాలి. లోకములోనికి వచ్చిన ఈ రాజు వ్యక్తుల జీవితాలలోనికి వచ్చాడు, వస్తున్నాడు, రాబోతున్నాడు. దేవుడు మనకిచ్చిన గొప్ప వరం యేసే! మన **క్రిస్మస్** ఆనందం వర్ధిల్లాలి.

దైవాశీస్సులతో క్రీస్తునందు **మీ ఆరార్కే**

# మనలోమాట ...

క్రీస్తునందు మా ప్రియ పాఠకులకు..

క్రిస్మసు, నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీ ప్రదాన సంపాదకులు, సంపాదకులు అమెరికాలోని తెలుగు సంఘాలను, కుటుంబాలను దర్శిస్తున్నారు.

అమెరికాలోని తెలుగు క్రైస్తవ సోదర, సోదరీలు మమ్మును ఎంతో ప్రేమతో చేర్చుకుంటున్నారు. అక్కడున్న మనవారంతా మీకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అనేకమంది, వారిని దర్శించమని ఆహ్వానాలు పంపుతున్నారు గాని సమయం లేకపోవటం చేత వీరందరిని దర్శించలేక పోతున్నాము.

గతమాసములో బోస్టన్ అనే స్థలములో జరిగిన సభలు వరకు వివరాలు మీకు రాశాను. ఆ తరువాత ఎన్నో సభలలో మాట్లాడాము, మరిన్ని గృహాలను దర్శించాము. మేము వెళ్ళిన స్థలములో ఆయా కుటుంబాలకు దేవుడు మమ్మును ఆశీర్వాదకరముగా చేశాడు. మేము అమెరికా ప్రయాణం అనుకున్న నాటినుండి మా ప్రార్ధన ఇదే "ప్రభూ మేము వెళ్ళిన ప్రతిచోట మీ ప్రజలకు మమ్మును అశీర్వాద కారణముగా చేయండి"

దైవజనులు ఆచార్య ఆరార్కే గారి కోసం, నా కోసం, మాఆరోగ్యం కోసం, సేవలో ప్రభువు ప్రత్యేక ఆత్మ అభిషేకం కోసం మీరంతా ప్రార్థిస్తున్నారు, మీ అందరికి వందనాలు.

డిసెంబరు 15కు బయల్దేరి ఓ వారం లండన్‌లో తెలుగు వారి మధ్యన సేవ జరిగించి ఇండియాకు వచ్చేస్తాము. మా ప్రయాణాల కోసం, మిగతా రోజుల్లో ఇక్కడ జరిగే సేవ కోసం ప్రార్థించాలని మనవి. వచ్చేనెలలో మరిన్ని వివరాలు, మరిన్న ఫొటోలు ప్రచురిస్తాము.

ఈ క్రిస్మసు శుభసమయములో ప్రభువును ఎరుగని వారికి సువార్తను ప్రకటించటానికి ప్రయత్నిద్దాము. యేసుక్రీస్తు ప్రభువు వారు మానవ పాపాలను పరిహరించి, నిజమైన శాంతి, సంతోషం ఇచ్చే దేవుడని లోకానికి చాటుదాం. ఈ రోజున చాలా మంచి మతములో ఉండి పండుగ జరుపుకునే వారున్నారు, వారి కోసం ప్రత్యేకముగా ప్రార్థనలు చేద్దాం.

స్పందన సేవలో మీరిచ్చే సహకారం కోసం వందనాలు. ప్రభువు పనిని ప్రేమించి సహకరించే మీలాంటి నమ్మకమైన ప్రార్థన సహకారులను దేవుడు ఈ సేవలో స్థంభాలుగా నిలిపాడు. ప్రభువును ప్రేమించి మీరిచ్చే అమూల్యమైన సహకారం, ప్రార్థనలతో మేము సేవలో ముందుకు కొనసాగుతున్నాము. దేవునికి స్తోత్రం.

**క్రీస్తునందు పరిచర్యలో మీ ప్రదాన సంపాదకులు, సంపాదకులు.**

**ఆరార్కే, దేవ**

# క్రిస్మస్ ప్రభువు



ఆచార్య ఆరార్కే

**క్రిస్మసు** అంటే పండుగ అని అర్థం చెప్పుకునే వారు అనేకులున్నారు. ఆధ్యాత్మిక పరిపక్వత గలవారు, ఆత్మాశ్రయ భావన గలవారు చెప్పే నిర్వచనం క్రిస్మసు అంటే యేసే. దేవుడి అసలు పేరు అవ్యర్ధనామం "యేసు; ఈ పేరుకు అర్థం యెహోవా రక్షకుడు" ఇది విశ్వాసుల హృదయం మీద దేవుడు చేసిన సంతకం. అవి యేసు రక్తాక్షరాలు. యెహోవాయీరే. దేవుడే మనకు యేసునిచ్చాడు.

యేసు పుట్టాడు అంటే దేవుడు మానవ అవతారమెత్తాడని అర్థం. క్రిస్మసు నాడు యేసు పుట్టుకను, పుట్టిన యేసును మనం మహిమ పరచాలి. మతం క్రిస్మసునాడు పండుగ చేసుకుంటుంది. కాని క్రైస్తవ ఉద్యమం పుట్టిన యేసును సజీవుడని చెప్పి ఆయనను కీర్తిస్తుంది. ఆయన నుండి స్ఫూర్తిని పొందుతుంది.

మా స్పందన పాఠకులు యేసు నామములలో కొన్నిటిని ధ్యానించాలని, ఆరాధనాత్మకమైన స్తుతి ప్రశంసలతో పాటు పరోపకార కార్యక్రమాలు కొనసాగించాలని, విశేషించి యేసు చైతన్యంతో అందరూ నిండిపోవాలని స్పందన పరివారమంతా మీకు క్రిస్మసు శుభములు తెలియజేస్తున్నాము. అమెరికాలోని విశ్వాసులందరూ భారత దేశంలోని మీకు శుభాకాంక్షలు పంపుతున్నారు.

**1. క్రీస్తు ఎవరు?** లూకా 2:12 యేసు ఒక శిశువై పొత్తిగుడ్డలలో చుట్టబడి, పశువుల తొట్టిలో పరున్నాడు. ఆయన ప్రభువు, ఒక శిశువైనాడు. కాపరులకు ఆయనను చూడటం ఎంతో సులభమైంది, ఎంతో అందమైన దివ్యశిశువు! పదివేలలో అతిసుందరుడు, మామూలు ప్రజలకు సైతం అందుబాటులో ఉండాలని అలా శిశువు అయ్యాడు. పరలోక మహిమను ఆయన విడిచి వచ్చాడు కాని మహిమ ఆయనను విడిచినట్టు లేదే! అమాయకులైన కాపరులు ఆయన ఎదుట సాష్టాంగ పడ్డారు. యేసు అనే పేరులో మహిమ ఉంది. రక్షించే పని మీద వచ్చాడు. ఆ కార్యం మరెవరూ చేయలేరు. దేవుడు స్వయానా మనిషిలా రావటం కాదు, పుట్టడం జరిగింది. పుట్టుకను కాదు. పుట్టిన దేవుణ్ని మహిమపరచండి. సుమెయోను యేసునందు రక్షణను కన్నులారా చూచాడు. లూకా 2:30.

**2. యేసు తండ్రి పనిమీద వచ్చాడు.** లూకా 2:43 తండ్రి పంపితే వచ్చాడు. పశువుల తొట్టినుండి సిలువ వరకు సరళరేఖను ఆయన తన పన్నెండో ఏట చూచాడు. లూకా 2:45. మరియ, యోసేపుల పనిమీద ఆయన ఉండడు. దేవుడే శరీరధారియై వచ్చాడు. యేసుకు చెందిన వారు దేవుని పనిమీద ఉండాలని హెచ్చరిక. "నా రాజు పనిమీద నేను ఉన్నాను. రాయబారిని యేసు రాజ్యపౌరుడను."

**3. యేసు అసలు ఎవరు?** తనను కన్న తల్లికి కూడా ఆయనే రక్షకుడు. యేసు, తండ్రి పంపగా వచ్చిన, రక్షకుడుగా పుట్టిన ప్రభువు. లూకా 1:47. మరియ పాడింది. రక్షకుని యందు ఆనందించింది. రక్షించబడి, విమోచన గీతం పాడింది. చక్కని క్రిస్మస్ పాట. రక్షణ అంటే రక్షకుడే. సిలువ మీద లోక రక్షణ కార్యం ముగించి "సమాప్తం" అని విజయ ధ్యానం చేసిన రక్షణకర్త. మరియ పాట క్రీస్తు కేంద్రితమైన రక్షణ గీతం. మరియ స్త్రీలందరిలో దయా ప్రాప్తురాలు, స్త్రీలకు పైగా కాదు. ఆమె ధన్యజీవి. యేసు రాజ్యం, సుభోజ్యం. ఆయన ఇహలోక రాజుల్ని గద్దె దించగలడు. తన కిష్టమైన వారిని గద్దె ఎక్కించగలడు. గర్విష్టులను అణగదొక్కి వినయశీలురకు సమృద్ధిని ఇవ్వగలడు. ఆయన పాపుల విమోచన క్రయమై, సిలువ బలిపీఠంపై తన రక్తం కార్చిన లోకరక్షకుడు. మార్కు 10:45.

**4. యేసు కార్మికులకు, దళితులకు దేవుడు.** యేసు వడ్రంగి పని చేశాడు. మార్కు 6:3. మనుషులలో మనిషి. కాయకష్టం చేసుకునేవారి దేవుడు. కూలిప్రజల దేవుడు. రోగులకు, నిస్సహాయులకు దేవుడు. దేవుని కుమారుడు మనుష్య కుమారుడయ్యాడు. మార్కు 6:8 బోధకులారా మీ పాండిత్యాన్ని అవతల పెట్టేసి, నిరక్ష్యరాసులకు కూడా అర్ధమయ్యేట్లు సువార్త చెప్పండి. మాటల వెనుక దాక్కుని బోధించకండి. మీ ప్రసంగ వేధికల్ని మరీ అంత ఎత్తుకు పెంచుకొని, కింద ఉన్న బడుగు ప్రజలతో మాట్లాడకండి. వారి మధ్య జీవిస్తూ, యేసులాగా సువార్త మాట్లాడండి. ప్రసంగ ప్రదర్శనలు తగ్గించండి. గనిలో, వనిలో, కార్ఖానాల్లో మామూలు మాటల్లో యేసును చెప్పండి. చూపండి. ఇది క్రిస్మస్ భావవిప్లవం, భాషావిప్లవం, సువార్తవిప్లవం.

**5. యేసు మానవ సోదరుడు.** మార్కు 3:35 యేసు రక్తం, దేవుని రక్తం. తండ్రి రక్తం. ఆయన రక్తం మనందరికీ ఇవ్వబడింది. ఆ రక్తాన్ని బట్టి మనుషులంతా ఆయన సోదరులవుతున్నారు. ఆయన మన జ్యేష్టసోదరుడు. "పరలోకమందున్న మా తండ్రీ" అని మనల్ని కలుపుకుని, దేవుణ్ని సంబోధించాడు. యేసు నా అన్న, నీ అన్న. మనమంతా దేవుని కుటుంబం. శరీర రీతిగా తన బంధువుల్ని, సోదరుల్ని ప్రత్యేకించకుండా మనుషులందర్నీ కలిపి "నా బంధువులు, తమ్ముళ్లు, చెల్లాయిలూ" అన్నాడు. అందరూ తండ్రి చిత్తాన్ని నెరవేరుస్తారు." అన్నాడు. దేవునికి స్తోత్రం. తండ్రి చిత్తమేమిటి? యేసును రక్షకుడిగా ప్రభువుగా అంగీకరించడం, దేవుని వాక్యానికి తగ్గట్టు బతకటం. యేసు మన సోదరుడు! ఎంత తగ్గింపు! ఆయన మనకెంతో సన్నిహితుడయ్యాడు.

**6. యేసు మహాసేవకుడు.** మత్తయి 12:18 "ఇదిగో ఈయన నా సేవకుడు. ఈయనను నేను ఏర్పరచుకున్నాను." మత్తయి ఇక్కడ యెషయా ప్రవచనాన్ని ఉదహరించాడు. యేసు ఎవరనుకున్నారు? మన పాదాలు కడిగేటంతగా తగ్గించుకున్న మహాసేవకుడు. "తండ్రి నీ చిత్తము నెరవేర్చటమే నాకు ఆనందం!" నా తండ్రి పని పూర్తి చేయటమే నాకాహారం అని యేసు స్వయంగా సాక్ష్యమిచ్చాడు. ఆయన సృష్టికర్త అయిఉండి, గొప్పకార్యమేదైనా చేయగల సమర్థుడై ఉండి, తన శిష్యుల పాదాలు కడిగాడు. విధవరాలి రెండు కాసుల కానుకను ఆప్యాయంగా అందుకున్న తగ్గింపు ఆయనకే తగును! **క్రిస్మసు సందేశమిదే**- దేవుని బిడ్డలారా- 'యేసుతో సేవ' అనే కాడి మొయ్యండి. ఆది యేసు కాడి. ఆయన కాడి ఎత్తుకొని మోసినవాడు, క్రిస్మసుప్రభువైన యేసును సంతోషపెట్టగలడు. యేసుతో కలిసి కాడి మోస్తూ బీడభూములు దున్నాలి. బంగారు పంటలు పండించాలి. 'ఇది కోతకు సమయం' అని వ్యర్థమైన పాటలు పాడకండి. ఇది భూమి దున్నే సమయం. విత్తనాలు వేసే సమయం. విత్తనివాడు పంట కోస్తాడా? కోతపాటలు మానండి. కార్యోన్ముఖులు కండి. క్రిస్మసునాడు సేవా తీర్మానం చేసుకోండి. పండుగ మనస్తత్వం మతం! మతం వద్దు, గతం వద్దు. యేసు

కాడి మోత ఫలవంతమైన సార్థకమైన క్రిస్మసు.

**7. పాపుల స్నేహితుడు** మత్తయి *11:19* "ఆయన వంచకులకు, పాపులకు స్నేహితుడు" ఈ మాట అక్షరాల నిజం, వాస్తవం. క్రైస్తవభక్తి తనకుతాను హెచ్చించుకొని పాపులను వేలుపెట్టి చూపి, దూరంగా మడి కట్టుకొని కూర్చోదు. క్రీస్తు ఆత్మగలవారై పాపులను స్నేహశీలంతో రాబట్టాలి. యేసు పరిసయ్యులను గద్దించాడు, గాని పాపులను ఎంతో ప్రేమగా ఆప్యాయంగా పలకరించాడు. "ఛీ! పరిసయ్యులారా వేషదారులారా" అన్న యేసు సమరయ స్త్రీతో "అమ్మా" అంటూ ఆత్మీయంగా మాట్లాడాడు. క్రిస్మసు అంటే మురికి పేటల్లో క్రీస్తుప్రేమను చూపి ఆనందించే మనస్తత్వం. ఏడాది కొకసారి వెక్కిరించినట్లు దానధర్మాలు చెయ్యడం మతం. సర్వకాల సర్వావస్థలలో వారికి సేవ చేయడం క్రైస్తవ ఉద్యమం! క్రైస్తవ భక్తుడా! నీవు పాపులకు స్నేహితుడివా? లేదా "నన్ను ముట్టుకోకు... అంటూ నీ భక్తిని ఇతరుల భక్తితో పోల్చుకొని గర్విస్తావా? తగ్గు భక్తుడా తగ్గు!

**8. యేసు, యేసు, యేసు.** యేసే క్రిస్మసు. క్రీస్తు మనకు అనుదిన పండుగ. మిగతాదంతా దండుగ. కొత్తనిబంధనలో మొత్తం 700 సార్లు యేసు అనే పేరు వస్తుంది. లెక్కపెట్టి చూచుకోండి. పాతనిబంధనలో విశ్వాసయోధుడైన యెహోషువా యేసుక్రీస్తుకు ముందు గుర్తు. తన ప్రజల్ని యోర్దాను దాటించాడు. యేసు కొత్తనిబంధన యెహోషువా. మనలను మరణం నుండి నిత్య జీవంలోనికి దాటించాడు. యోహోషువా కంటే శ్రేష్టుడు. యేసే క్రైస్తవ కేంద్రం. ఆయన మన నాయకుడు. ఆయనే మన కాపరి. రక్షకుడు. ప్రభువై మనల్ని నడిపించే నాయకుడై పరలోకంలో నిన్నూ, నన్నూ తన సింహాసనం మీద కూర్చోబెట్టుకునే వరకు ఆయన మనలను ఎడబాయడు. క్రిస్మస్‌లోని యేసు శుభములు మీకు కలుగును గాక. ఆమెన్.

## నవంబర్ నెల గ.ను.క ఆల్‌కరెక్టుగా జవాబులు వ్రాసిన వారిపేర్లు

టి. సువర్ణరాజరత్నం – కడప, ఎస్. జమీమ – విజయవాడ, హెచ్. మేరి – కర్నూలు, యం. స్వర్ణలత ఏంజల్ – కర్నూలు, కె. కనకమ్మ, టి. శోభరాణి – హన్మకొండ, జి. జోసఫ్‌కిశోర్ – చింతగుంట్ల, ఎస్. పుష్పరాగం–గుంటూరు, ఎ. మునిరాజు– కడప, రాజశ్రీచంద్రమణి–చిత్తూరు, జి. రిబకమ్మ, జి. పాల్–కలశపాడు, మార్తయేసుదాసు–జమ్మలమడుగు, భారతిదేవప్రియం– కడప, వి. లక్ష్మినరసమ్మ–విస్సన్నపేట, పి. ఆశీర్వాదము–పుసపాటిరేగ, కె. జె. ఎవాంజలిన్–గాజువాక, హెచ్. సరళమ్మ, హచ్. బి. హిమబిందు–గిద్దలూరు, వై. ఎసేర్తమ్మ, వై. మాణిక్యం, కె. శెశీల్య– కంచికచర్ల, కె. విమల–కొత్తవలస, ఎస్. దేవమణి– ఎమ్మిగనూర్, బి. కె. శ్యామలదేవి– కర్నూలు, సి. రాణిప్రమీల–కర్నూలు, సలోమి–భీమవరం, ఆనీమేరి– హైద్రాబాద్, జె. ప్రసాదరావు–గోకవరం, బి. మణిజయప్రకాష్–అమ్మిరెడ్డిపాలెం, స్వర్ణలతసుందరం–కడప, ఆర్. రాజ్యలక్ష్మి– మంతెన, యన్. సత్యనారయణ, డి. డి. ఎ. మణి– విశాఖపట్నం, యం. సువర్ణరత్నం–కంచికచర్ల, బి. కృపానందము–నర్సాపురం, మేర్సిలారెన్స్– కాకినాడ, డి. సుందర్‌రాజన్–కుప్పం, పి. హిల్డమార్గరెట్–నెల్లూరు, ఫెయిత్ రాజామణి–మైలవరం, కస్తూరిభాయి– మదనపల్లె, శ్రీమతి సునంద యేసుపాదం–మదనపల్లె, జయమ్మలాబాను–గుంతకల్లు, కె. సుధారాణి– అమ్మపాలెం, జాల వినయకుమారి–కొలకలూరు, హెచ్. ఫ్లారెన్సమ్మ– చిన్నదొర్నాల, బి. కెంపురత్నకుమారి, ఝాన్సీశాంతకుమార్– హన్మకొండ, బి. శాంతకుమారి–కడప, పి. శోభరాణి–హైద్రాబాద్, దీనా టి. క్రిష్టఫర్–వరంగల్, జి. శారరావు, జి. ఎస్. సునీతరావు– బద్వేల్, జాషువమాథ్యుస్–ఒంగోలు, పి. ప్రకాశరావు–మంగళగిరి, కస్తూరిభాయి–చీరాల, కె. సమూయేలు–తాడేపల్లిగూడెం, మణితప్రభాకర్– నంద్యాల, యు. ఎస్. పురోషోత్తం– ప్రొద్దుటూరు, కె. విమల – హైదరాబాద్,

ఒక్క తప్పుతో వ్రాసినవారు: ఆర్. యం. విజయకుమారి–మదనపల్లె, జంపా కోమలదేవి– విజయవాడ, పి. యస్. భాగ్యవతమ్మ– గిద్దలూరు, ఎ. యస్. ప్రభావతి–గుంతకల్లు

# క్రిస్మస్ కాంతి




**త**రతరాల నిరీక్షణ ఫలమే యేసుక్రీస్తు పుట్టుక. మెస్సీయా రాకడ. దేవుడు మానవ చరిత్రలో ప్రవేశించిన శుభదినమే క్రిస్మస్. ఆయన పుట్టినప్పుడు ఇశ్రాయేలు జాతి పరుల చేతిలో ఉంది. దాస్యం, అన్యాయం, అవినీతి, ముమ్మురంగా వున్నాయి. అబ్రాహాము యూదులకు తండ్రి. అబ్రహామీయ వంశవృక్షంలోవాడే యేసు. దావీదు గోత్రపువాడు. పాత నిబంధన ప్రవచనాలు నెరవేర్చిన యేసు పుట్టుక, చరిత్రలో అపూర్వ సంఘటన. చరిత్రలో అడుగుపెట్టిన దేవుడు సృష్టికర్త.

## కన్య మరియ:

యేసు కన్యక గర్భమున జన్మించాడు. దేవుడే యేసు తండ్రి. అయితే మరియ, యేసేపులిద్దరూ దావీదు గోత్రీకులే. ఆదాము నుండి మనుషులందరికీ పాప స్వభావం సంక్రమించింది. యేసు పాపరహితుడు. ఆయన స్త్రీ గర్భాన పుట్టినందు చేత మానవుడు. కాని, ఆయన దేవుని కుమారుడు. అందుచేత ఆయనలో పాపం ఏ మాత్రము లేదు. ఆయన పరిశుద్ధుడు. యేసు సంపూర్ణ దేవుడు కూడా. మానవుడై మన కష్ట సుఖాలు పంచుకున్నాడు. దేవుడై మానవులను వారి పాపాల నుండి రక్షించగలుగుతున్నాడు. మానవులకు అర్ధవంతమైన సాయం చేయడానికి దేవుడు మానవుడయ్యాడు. అయితే ఈ శిశువును కన్య కనటం ప్రజల దృష్టిలో అనుమానానికి కారణమైంది. ఈ అనుమానం దేవుడే తీర్చాడు. యోసేపు దేవుని మాట చొప్పున మరియను భార్యగా స్వీకరించాడు. యేసేపు భక్తిగలవాడు. ప్రేమా, సానుభూతిగలవాడు. క్రమశిక్షణగల వ్యక్తి. దేవునికి విధేయుడు. వివాహానికి పూర్వం గర్భిణి అయిన కన్యను రాళ్ళు వేసి కొట్టి చంపవలసి వుంది. యోసేపు దేవుని జ్ఞానంతో వ్యవహరించాడు. దేవునికి స్తోత్రం.

## చారిత్రాత్మకం:

యేసు జన్మ ఎప్పుడూ, ఎక్కడ జరగనటువంటి అద్భుత చారిత్రికమైనది. ఆయన పుట్టుకను గూర్చిన అపోహల్ను దేవదూతలే తొలగించారు. యేసు పుట్టుకను గురించిన కబురు తెచ్చిన వార్తావహులు దేవదూతలే! రక్షకుడు పుట్టాడు. పాపులను రక్షించటానికి వచ్చాడు. మనుషులు తమను తాము రక్షించుకొలేరు. యేసే రక్షించగలవాడు. ఆయన పేరు ఇమ్మానుయేలు. దేవుడే మనకు తోడు! దేవుడై, మనిషై, మన మధ్య ఉన్నాడు. ఈ రోజు ఇమ్మానుయేలు మనమధ్యకాదు, మనలో–నీలో–నాలో ఉన్నాడు.

యేసు పుట్టిన ప్రదేశం బెత్లెహేము. అసలు మరియ, యోసేపుల స్వస్థలం నజరేతు. యూదైయ రాష్ట్రంలోని బెత్లెహేము ప్రవచనాత్మకమైన వూరు. యేసు పుట్టుకతో ఈ ఊరు చరిత్రాత్మకమైంది.

## జ్ఞానుల యాత్ర:

వీరు జ్ఞానులు. జ్యోతిష శాస్త్రపారంగతులు. ప్రాచీన బబులోను నగర ప్రాంతంలోని పార్తియా దేశానికి చెందినవారు. వీరు బబులోనులోనే వుండిపోయిన యూదులు. అందుకని పాత నిబంధన ప్రవచనాలతో వీరికి పరిచయం ఉంది. వీరు ఎన్నో గ్రంథాలు చదివిన పండితులు. అంతకాదు, వీరు దేవుని చేత ప్రబోధించబడిన ధన్యులు. ఇశ్రాయేలులోని యూదులే మెస్సీయా పుట్టుకను గుర్తించలేదు గాని, అన్యదేశంనుంచి వచ్చిన జ్ఞానులు గుర్తుపట్టారు. యేసు సార్వత్రిక ప్రభువు. అందుకే దూరదేశాలనుంచి జ్ఞానులు ఆయనను ఆరాధించటానికి వచ్చారు.

## శిశు సందర్శనం:

యేసు వారి దగ్గరికి వెళ్ళలేదు. వారే వ్యయప్రయాసలను లెక్కచేయకుండా, వేల కొలది మైళ్ల ప్రయాణం చేసి, యేసు వద్దకు వచ్చారు. యేసుకు కానుకలిచ్చారు. మనం పొందిందిగాదు, మనం యిచ్చింది కానుక అవుతుంది. యేసు ఏమై ఉన్నాడో దాన్నిబట్టి ఆరాధన. అంతేగాని, ఆయన ఏమిస్తాడో లెక్క చూసుకోవటం గాదు.

## నక్షత్రం:

ఇది దేవుడే ప్రత్యేకించి వెలిగించిన నక్షత్రం. జ్ఞానులు ఈ నక్షత్రాన్ని చూచి, ఆ తరువాత నక్షత్రం హేరోదు దర్బారు నుంచి నజరేతుకు నడిపించగా, వారు వెళ్లి యేసును చూచారు. వారి ప్రయాణము రెండుసంవత్సరాలు పట్టింది. యేసు బాలుడిని, మరియ-యోసేపులు నజరేతుకు అప్పటికే తీసుకవెళ్లారు. హేరోదు అసూయాపరుడు జ్ఞానులు ఈ యూదా రాజును ఆరాధించటం అతనికిష్టంలేదు. తన సింహాసనానికి అది ముప్పు.

## ప్రవచనం:

మీకా 5:2 లోని ప్రవచనాన్ని స్థానికపండితులు గుర్తించారు. యూదులకు రాజు పుట్టాడు. రెండు సంవత్సరాల బాలుడై ఉంటాడని చెప్పి హేరోదు ఆ ప్రాంతంలోని "పసిపిల్లలందరిని వధించండ"ని ఆజ్ఞాపించాడు. హేరోదు అబద్ధికుడు. అతడు యేసును ఆరాధిస్తానని చెప్పి వధించటానికి పూనుకున్నాడు. హంతకుడు. జ్ఞానులు తెచ్చే కానుకలు మామూలువి కావు. వాటి ఎంపికలోనే ఎంతో జ్ఞానం ఉట్టిపడుతోంది.

## మూడు విధాల కానుకలు:

బంగారము రాజుకు తగిన కానుక! సాంబ్రాణి దేవత్వాన్ని సూచిస్తుంది. బోళము శ్రమను, మరణాన్ని వ్యక్తం చేస్తుంది. యేసు రాజనీ, దేవుడనీ, మానవుల రక్షణార్థమై చనిపోతాడని ఈ మూడు కానుకలు ముక్తసరిగా యేసు పరిచర్యను ప్రతిఫలించాయి. యేసు బాలుని కాపుదల కోసం మరియ యోసేపులు ఈజిప్టుకు వెళ్లాల్సి ఉంది. వారి ప్రయాణపు ఖర్చులకు ఈ కానుకలు ఉపయోగపడ్డాయి. జ్ఞానుల ఆరాధనకు యేసు ఏమై ఉన్నాడో, ఆ సత్యమే కేంద్రము. యేసుదేవునికి శ్రేష్టమైన కానుకలు తెచ్చిన వారే జ్ఞానులు. యేసును ఆరాధించండి. సాగిలపడి మ్రొక్కండి. ఆయన పరిపూర్ణుడు. ఆరాధన పాత్రుడు. సృష్టికర్త. నీ సమర్పణను ఆయన కోరుతున్నాడు.

## మరోదారి:

యేసును చూచాక, జ్ఞానులు వచ్చిన దారిన తిరిగి వెళ్ళలేదు. మరోదారిన వెళ్లారు. అలా వెళ్ళమని దేవుడే స్వయంగా చెప్పాడు. అలాగే, ఎవరైనా యేసును చూచారూ అంటే వారి జీవిత గమ్యమే మారిపోతుంది. దేవుని వాక్యం మన జీవిత విధానాన్ని మారుస్తుంది. ఆ తరువాత, యేసుబాలుణ్ణి తీసుకొని, మరియ, యోసేపులు ప్రయాణం కట్టారు. యేసును కాపాడాలి. హేరోదు బారినుండి తప్పించాలి. యేసును భద్రంగా తీసుక వెళ్లాలి. ఆయనను ప్రాణప్రదంగా చూచుకున్నారా దంపతులు. అలాగే విశ్వాసులు తమలో ఉన్న యేసును భద్రంగా, ప్రాణప్రదంగా చూచుకోవాలి, పోగొట్టుకోకూడదు. శోధనలకు లోనై యేసు కృపను కోల్పోకూడదు.

## ఈజిప్టు ప్రయాణం:

ఆ రోజుల్లో ఈజిప్టులో యూదుల వలస స్థానాలెన్నో ఉండేవి. యూదులు పూర్వం చెరగొని పోబడ్డప్పుడు ఏర్పడిన "కాలనీలు". యేసు ఈజిప్టుకు వెళ్లే ప్రయాణానికి, ఇశ్రాయేలు చరిత్రకు పోలికలున్నాయి. ఇశ్రాయేలు ఓ జాతిగా రూపొంది నప్పుడు, ప్రారంభ దశలోనే ఈజిప్టుకు వెళ్లిపోయారు. అలాగే యేసు బాల్యంలో ఈజిప్టుకు వెళ్ళాడు. యేసు తిరిగి వచ్చేశాడు. యూదులు తిరిగి వస్తారు. దేవుడు తన ప్రజలను కాపాడుతున్నాడన టానికి ఇదో ప్రవచనాత్మక ఘటన.

## శిశుహత్య:

రెండు సంవత్సరాలలోపు వయస్సుగల శిశువు లందర్నీ హేరోదు రాజు చంపించాడు. యేసును చంపటమే అతడి ధ్యేయం. రాజుగా పుట్టిన యేసును హతమార్చాలని పూనుకున్నాడు. అతని చేతులు ఈ శిశుహత్య కాండతో రక్తసిక్తమైయ్యాయి. అయినా అతడు యేసునేమీ చేయలేక పోయాడు. హేరోదు, మనుషులు చేసిన రాజు. యేసు, దేవుడభిషేకించిన క్రీస్తు. దేవునికి విరోధంగా రూపొందించిన ఏ ఆయుధమూ వర్ధిల్లదు. దేవుని సంకల్పమే సిద్ధిస్తుంది. దేవునికి వ్యతిరేకులైన వారే హతమారి పోతారని చరిత్ర పాఠం నేర్పుతోంది. యేసుక్రీస్తుకు హేరోదు సింహాసనం అక్కరలేదు. హేరోదు జీవితానికి ఆయన రాజు కాగోరు తున్నాడు. అదీ సంగతి. హేరోదు యేసును అపార్థం చేసుకొన్నాడు. హేరోదుకు నిత్యజీవమివ్వటానికి యేసు వచ్చాడు గాని, అతడిని హతం చేసి సింహాసనం లాక్కోవ టానికి కాదు. స్వేచ్ఛ, శాంతి, ఆనందం నీ కివ్వటానికి యేసు వొచ్చాడు గాని, నీదేమీ తీసుకపోవటానికి కాదు.

## రాహేలు ఆక్రందన:

యాకోబు భార్య రాహేలు. పాత నిబంధన వీరులలో యాకోబు ఒకడు. యాకోబుకు 12గురు కొడుకులు. వీరి నుండి పన్నెండు ఇశ్రాయేలు గోత్రాలు వచ్చాయి. రాహేలు బెత్లెహేము దగ్గరే సమాధి చేయబడింది. శిశుహత్య కారణంగా రాహేలు ఘోరంగా ఆక్రందన చేసింది. ఆమె ఓదార్పు పొందలేకపోయింది. యిర్మీయా 31:15 ప్రవచనం ఈ విధంగా నెరవేరింది.

## హేరోదు మరణం:

క్రీ॥పూ॥ 4వ సం॥లో హేరోదుకు రోగం వచ్చింది. అదేవాని ప్రాణాలు తీసింది. అతని ముగ్గురు కొడుకులూ తండ్రి రాజ్యాన్ని పంచుకున్నారు. ఆర్కెలాయు, హేరోదు అంతిప, రెండో హేరోదు పిలిప్పు. వారిలో అర్కెలాయి దుర్మార్గుడు. 3 వేలమంది నాయకులను ఉచకోత కోశాడు. తొమ్మిదేండ్ల తరువాత దేశ బహిష్కారం పొందాడు. యోసేపు కుటుంబం తిరిగి వచ్చినప్పుడు ఇతడి రాజ్యంలేదు. ఇది దేవుని ఏర్పాటు.

## ముగింపు:

ప్రియ సోదరా, సోదరీ! క్రిస్మస్ చరిత్ర నీ నుండి కోరేదేమిటి? చరిత్రకు ప్రభువైన యేసు, నీ వ్యక్తిగత జీవితంలో ప్రవేశించగోరుతున్నాడు. హృదయపు తలుపు తియ్యి, ఆయనను రమ్మను. దేవుడు మిమ్మును దీవించును గాక!

## నవంబర్ గనుక జవాబులు

**అడ్డం :**

1.సమీపము 3. వారసు 5. కపాల 6. జయించు 8. నూనె 10. పాదము 11. పూరా 12. ఒడిలో 14. ముదత 16. పొరపెట్టు 17. కాడి 18. ఆది 19. రేవు 20. కణకణ 21. కాసు 22. గురి 23. కటిక

**నిలువు :**

1. సమాజము 2. టపాతు 4. సువర్ణము 7. అపార్థము 9. నూర్చెడి 11. పూర్ణరక్షణ 12. ఒట్టు 13. లోకాధికారి 15. తడవు 19. రేపటి 20. కక్కి

# నూతన పుస్తకాల పరిచయం







***"The Legacy of God's People" and "The Holy Land Tour" is the unique book with 130 multi color pictures from Bible and Holy Land, Jerusalem and Israel.***

***"The Legacy of God's People" and "The Holy Land Tour"*** *are put together in this book as part A and B. All the matter and beautiful pictures are designed for the lovers of the Bible and the Holy Land Israel. If you are a traveler or just a dreamer of the Holy Land, this book will provide you very useful and valuable information about the Land.*

*Open this book and walk along the bright and shadowy streets of The Old Testament, historical places and events of the Bible. This book will also help you to admire The Holy Land and to breath the presence of God in every page.*

*The authors of this book are well known to our 'Spandana' magazine readers.*

**Rs.200/-**

**స్పందన పాఠకులకు చిరపరిచితులైన గ్రేస్ విజయగారు రచించిన 6వ పుస్తకము**

## ఈ తరంలో క్రీస్తు సాక్షి సమూహాము

జీవితగాధలు, యేసుక్రీస్తు ప్రసస్త రక్తము ద్వారా
రక్షించబడిన సాక్షిసమూహం.
224 పేజీలు సాక్షుల ఫోటోలతో
దేవుడు వారి జీవితాలకోరకు చేసిన అద్భుతాలు.
చదవండి. వెల. 35/- పోస్టేజి అదనం

# గ్రేస్ బైబిల్ కాలేజి, మంగళగిరి

సీట్లు పరిమితం

**3 నెలల ఆధ్యాత్మిక బైబిల్ ప్రత్యేక శిక్షణా తరగతులు**
**జనవరి 15 నుండి ఏప్రిల్ 15 వరకు**

3వ బ్యాచ్ ప్రారంభము

నూతన జన్మ అనుభవము కలిగి
సంపూర్ణ పరిచర్యలో కొనసాగుతున్న లేదా ఆసక్తి కలిగియున్న
యౌవన సహోదరులకు ప్రత్యేక సదవకాశము

**అర్హతలు :**

- తెలుగు చదువుట మరియు వ్రాయుట తప్పనిసరి
- వయస్సు : 15 నుండి 30 సం॥లోపు
- పరిపూర్ణ ఆరోగ్యము గలవారైయుండవలెను

**గమనిక : అప్లికేషన్స్ డిసెంబర్ 25లోపు మాకు అందజేయవలెను.**

అప్లికేషన్స్ పొందుటకు ఇతర వివరములకు సంప్రదించండి :
**9391377277, 9396480432**

# ప్రమోదంలో ప్రమాదం

రెవ.డా.డి.వి. డానియెల్

పండుగ అంటే ప్రమోదమే! "క్రొత్త బట్టలు, బిర్యానీ ఘుమఘుమలు, గృహాలంకరణ. దేవాలయ అలంకరణ- పండుగంటే ఇవే"- అని కొందరి మనో నిఘంటువుల్లో ఉంటుంది. ఇవన్నీ పండుగలకు సూచికలే. ఐతే కొన్ని సార్లు అప్రమత్తత వల్ల ప్రమాదాలు కూడ సంభవిస్తాయని మనకు తెల్సు.

ప్రపంచంలో-అందరు ఆచరించకపోయినా, ఏ దినాన ఎవరు ఎక్కడ ఆచరించినా క్రిస్మస్ ఒక పెద్ద పండుగే. అది యేసు పుట్టుకను జ్ఞాపకం చేసికొని క్రైస్తవులు ఆయనకు విశేష పూజలర్పించే పండుగ. అంతే కాదు- సృష్టి తొలి దినాల్లోనే చితికి పతనమై పోయిన మానవ జీవిత పునరుద్ధరణ కొరకు సృష్టికర్త రచించిన విమోచన ప్రణాలిక (ఆది. 3:14-16) అమలును, దరిమిలా యెషయా, మీకా మొ॥ ప్రవక్తల ప్రవచనాల నెరవేర్పును ప్రపంచానికి జ్ఞాపకం చేసే చారిత్రక సంఘటన-క్రిస్మస్. దీన్ని విశ్వసించడమే మానవాళి కనీస కర్తవ్యం. దీన్ని గూర్చి వికట విమర్శలు గుప్పించడం. అవిశ్వాసానికి అద్దం పట్టే ప్రశ్నలు వేయడం- అధిక ప్రసంగము అవుతుంది.

యేసు ఖచ్చితంగా ఏ సంవత్సరం, ఏ నెల ఏ తేదీన పుట్టాడు? దీనికి జవాబు "తెలియదు." మన దేశ చరిత్రలో దేశాన్ని ఎందరో రాజులు, చక్రవర్తులు ఏలారు. వాళ్లందరి పుట్టుక తేదీలు ఎవరు చెప్పగలరు? దేశ చరిత్రలో- వాళ్లెప్పుడు పుట్టారో అది ముఖ్యం కాదు. దేశానికి, ప్రజలకు ఏమి చేసారనేది ముఖ్యం. అదే చరిత్ర. వాళ్లందరి పుట్టుక తేదీలు ఖచ్చితంగా తెలీకపోతే వాళ్లు పుట్టనట్టేనా? ఎంత దారుణం!

యేసు జన్మం- ప్రపంచ చరిత్రలో ముడిపడి వుంది. ఆ దినాల్లో రోమన్ సామ్రాజ్యానికి సీజర్ అగస్టస్ చక్రవర్తి. సర్వలోకానికి ప్రజా సంఖ్య వ్రాయాలని ఆజ్ఞాపించాడు. "అది క్విరేనియస్ సిరియాకు అధిపతిగా ఉన్నప్పుడు వ్రాయబడిన మొదటి ప్రజాసంఖ్య, హెరోదు- యూదయ ప్రాంతానికి రాజు. యేసు మరణించిన దినాల్లో రోమన్ గవర్నర్‌గా పిలాతు ఉండేవాడు. క్రిస్మస్ దినాలు గొర్రెల కాపరులు తమ మందలను రాత్రివేళ బేత్లెహేం పొలాల్లో ఉంచి భూమికి ఎరువు పెట్టే దినాలు (లూకా 2:8; మత్తయి 2:1). ఈ చరిత్ర ఆధారంగా పురాతన లేఖనాలను(papyri) పరిశీలించి, పరిశోధించి పురావస్తు శాస్త్రజ్ఞులు, మేధావులు డిసెంబర్ 25ను ఖరారు చేసారు. కనుక క్రిస్మస్‌కు ఘడియలు, గంటలు, తేదీలు నెలలు ముఖ్యం కావు. "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీ యందు పుట్టి (ఆది. 3:15), మనము దత్త పుత్రులము (పుత్రికలము) కావలెనని ... ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను" (గలతీ. 4:4,5).

ప్రతి మానవుడు ఆలోచించ వలసిన ప్రముఖ ప్రశ్న ఒకటుంది. "క్రీస్తు ఎందుకు పుట్టాడు." పైన చెప్పినట్టు "మాట చెప్పి తప్పని దేవుడు" ఆదికాండం (3:15) లో దేవుడు చెప్పిన "స్త్రీ సంతానము" ఈ యేసే! ఈ ప్రశ్నకు క్లుప్తంగా రెండు జవాబులు :(1) సైతాను తలను చితుక గొట్టేందుకు, (2) పాపులుగా మారిన మానవులందరిని- పాపానికి జీతమైన

మరణం నుండి రక్షించేందుకు. యేసు పుట్టకపోతే మానవాళికి పుట్టగతులుండేవి కావు, పునర్జన్మ సాధ్యమయ్యేది కాదు. బైబిల్ అంటోంది. "ఒక మనుష్యుని(మొదటి ఆదాము) అవిధేయత వలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, ఆలాగే ఒకని విధేయత వలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు" (రోమా 5:19). తూర్పు దేశపు జ్ఞానులు "ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై చూచి, సాగిలపడి, ఆ మనుష్యుని పూజించి... కానుకలు ఆయనకు సమర్పించిరి" (మత్తయి 2:10,11). ఆ గొర్రెల కాపరులు త్వరగా వెళ్లి.... శిశువును చూచిరి..... ఈ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు ప్రచురము చేసిరి (మత్తయి 2:15-17). " విన్న వారందరు మిక్కిలి ఆశ్చర్యపడిరి"(18వ).

ఇంతకూ- "క్రిస్మస్ ప్రమోదాన్నిచ్చే పండుగే కదా! దానిలో ప్రమాదమేంటి?'' అంటారా! దానిలో రెండు ప్రమాదాలున్నాయని చెప్పుకోవచ్చు : (1) క్రీస్తు- సాక్షాత్తు దైవం, మహా తేజస్వి. ఆయన సహజ తేజస్సును నరులు తమ భౌతిక నేత్రలతో చూడలేరు. ఆయన దూతను సహా చూళ్లేరు(న్యాయాధి. 13:22). అందువలన- దేవుడే స్వచ్ఛందంగా - మానవుల మధ్య మానవునిగా- అందునా దాసుని స్వరూపం ధరించుకొని భూమిపై జన్మించాడు (ఫిలిప్పీ. 2:7,8). ఆయన సింహమే! "యూదా గోత్రపు సింహము'' (ప్రక. 5:5). కాని "దేవుని గొర్రెపిల్ల"గా వచ్చాడు(యోహాను1:29;ప్రక. 5:6;6:12;7:14;14:4;15:3; 17:14;19:9;21:23). అందుచేత ఆయన వ్యక్తిత్వాన్ని చులకనగా భావించి మామూలు పండుగే కదా అని కేవలం ప్రమోదాన్నే ఆహ్వానిస్తే ప్రమాదకరం.

యేసు దేవుని కుమారుడే కాని దేవుడు కాడని వాదించే మనుష్యులున్నారు. ఈ వాక్యాలు చదవండి. యోహాను (1:1,14; రోమా 9:4,5; కొల.1:15; తీతు 2:13; 1యోహాను 5:10). రెండవ ప్రమాదం- మోతాదు మించిన ప్రమోదం! యేసును- సంబరాల సందడిలో, మత్తుమందుల ముసుగులో ఆయన్ను మరువరాదు. "విస్తారమైన పనుల" మధ్య ఆయన్ను విస్మరించరాదు. "అవసరమైనది ఒక్కటే" (లూకా 10:41). "ఆత్మతోను, సత్యముతోను" ఆయనను ఆరాధించాలి (యోహాను 4:24).

ఒక విషాద సంఘటన: అనగనగా ఒక పెద్ద నగరం. అక్కడొక క్రైస్తవ ధనిక కుటుంబం. ఆయన పేరు ఐజక్. ఆమె పేరు రిబ్కా (పేర్లు కల్పితాలు). వాళ్లకు పెళ్లయిన 14 యేండ్లకు ఒక కుమారుణ్ణిచ్చాడు దేవుడు. ఆ అబ్బాయంటే వాళ్లకెంత మక్కువో ఊహించవచ్చు.

ఆ బాబు జన్మదిన ప్రథమ వార్షికోత్సవం డిసెంబర్ 30. నెల రోజులకు ముందే 200 మంది బంధువులకు, స్నేహితులకు ఆహ్వానం పంపించారు. వారం రోజులకు ముందు నుండే గృహాలంకరణ, భోజన సదుపాయాల సిద్ధపాటు; అంతా సిద్ధమైంది. ఆ రోజు రానే వచ్చింది. చేరుకొంటున్న అతిథుల్ని ఆప్యాయతతో ఆహ్వానించారు దంపతులు. ఇంటి ముందు 50 కార్లు నిలిచినై; ఆహ్వానం లేకుండానే వచ్చారు కొందరు. హాలంతా నవ్వులతో ముచ్చట్లతో నిండి పోయింది. వచ్చినవారు సహజంగా "బాబు ఏడండి" అని అడిగితే మంచి నిద్రలో వున్నాడండి అని అమ్మ జవాబు.

కాసేపయాక కొందరు స్త్రీలు నిల్చొని- "పదండి బాబును చూద్దాం" అని లేచారు; ఐజాక్, రిబ్కాలు కూడా లేచారు; "అదిగో అక్కడేనండి" అని ఐజాక్ దారితీసాడు హాల్ మూలన వున్న ఉయ్యాల వైపు. తల్లి ముందుగా పరుగెత్తి చూసి నివ్వెరపోయింది. వచ్చిన వాళ్ల స్వెటర్స్‌తో, కోట్స్‌తో నిండి వుంది ఉయ్యాల. వాటిని గబాగబా తొలగించే సరికి బాబు చనిపోయివున్నాడు.

"బాబూ, బాబూ, కన్నా, కన్నా" అని దంపతులు రోదించారు. అతిథుల కళ్లల్లో నీళ్లు చిమ్మినై. అంతే !

ఆలాగే క్రిస్మస్ సంబరాలలో ప్రమోదాల మోతలో "ఆ శిశువు'' (మత్తయి 2:11; లూకా2:16,28)ను మరచిపోతే ఆయన్ను సిలువ వేసినట్టే.

ఆ శిశువులో కన్పించే విధేయత, వినయం- అనే దీపాలు మనలో వెలిగించి మనమును లోకానికి వెలుగు అయిపోదాం ఆమెన్.

# ఈ క్రిస్మస్ శుభవేళలో...











**మా** ప్రియ పాఠకుల ప్రార్ధనలు, సహకారముతో ప్రతీ క్రిస్మస శుభసందర్భంగా పేదలకు క్రిస్మసు విందు, చలికి దుప్పట్లు ఇస్తున్నట్టుగా ఈ సంవత్సరం కూడా మన ఇరుగుపొరుగున వున్న పేదవారికి సహాయం చేయాలని ఆశిస్తున్నాము. స్పందన ఆధ్యాత్మిక కుటుంబంలో సభ్యులైన ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం లాగే ఈ సేవలో సహకరించాలని కోరు తున్నాము.

2007 క్రిస్మసు రోజు రాత్రి. దైవజనులు దేవసహాయం గారు వారి టీముతో విజయవాడ రైల్వే స్టేషన్, బస్టాండు ఇంకా ఇతర ప్రాంతాల్లో వున్న నిరుపేదలైన వారికి రుచికరమైన బిర్యాని ప్యాకెట్లు, చలిలో పడుకున్న వారికి దుప్పట్లు పంచారు. చికెన్ బిర్యాని పాకెట్ అందుకున్న వారు సంతోషంగా అంతే గాబరా, గాబరాగా ఆ ప్యాకెట్ విప్పి బోజనం చేస్తున్న వారిని చూస్తుంటే తెలియకుండానే కన్నీళ్లు వస్తాయి. వారి కోసం ప్రార్ధన చేసి, యేసయ్య పుట్టిన శుభసంధర్భాన్ని గురించి రక్షణ గురించి కొన్ని మాటలు చెప్పి వచ్చాము. ఇలాంటి వారికి సహాయం చేసేవారిని పరలోకంనుండి చూచే ప్రభువు తప్పక ప్రతిఫల మిస్తాడు.

ప్రభువు మిమ్ములను ప్రేరేపిస్తే మీ సేవాకానుకలు పంపి ఈ సేవలోని ఆశీర్వాదాలు అనుభవించండి. మీరు సాయం చేయగలిన అతి చిన్న కానుక (ఎంతైనా ఫరవాలేదు) నుండి ప్రభువు మిమ్మును అతి పెద్ద కానుకను ఈ దివ్య సేవలో ఓ విత్తనంలా వేయండి. నూరంతల ఫలితాన్ని జీవితాల్లో మీరు తప్పక చూస్తారు. దైవాశీస్సులు

**బీదలను కనికరించువాడు ఆయనను ఘనపరచువాడు. సామెతలు. 14:31**

**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**

**పోస్టు బాక్సు - 415, విజయవాడ -2**

***ఫోటోలు : గత సంవత్సరం డా॥ దేవసహాయం గారి బృందం పేదలకు దుప్పట్లు, బిర్యాని ప్యాకెట్లు పంచుతున్నవి.***

బోధించేవారికోసం

# క్లుప్త ప్రసంగాలు



## బేత్లెహేము కాపరులు

**లూకా 2:8-20**

1.కాపరులు తమ మందను కాస్తూ ఉన్నారు.లూకా 2:8

2.కాపరులకు ప్రభువు మహిమ ప్రత్యక్షత లూకా 2:9

3. కాపరులకు శుభవార్త తెచ్చిన దేవదూతలు లూకా2:10,11 16:7, మత్తయి 28:3

ఎ. యేసు పుట్టుక 'ఒక శుభవార్త'

బి. యేసు పుట్టుక 'ఒక ఆనందకర వార్త'

సి. యేసు పుట్టుక 'ప్రజలందరికి'

4.రక్షకుడు లూకా 2:11, 1:69,1:71,77, 2:30-32

5.క్రీస్తు ప్రభువు లూకా 2:11

6.పశువుల తొట్టిలో శిశువు సూచన లూకా 2:12

ఎ. పొత్తి గుడ్డలతో చుట్టబడుట

బి. పశువుల తొట్టిలో పరుండుట

7.సర్వోన్నతమైన దేవునికి మహిమ లూకా 2:13-14, యెహోషువ 5:14

8.కాపరుల ప్రయాణం లూకా 2:15-18

9.మరియ కాపరులు చెప్పిన విషయమును హృదయములో భద్రపరచుకొంది. లూకా 2:19

10.ఆనందముతో నిండిన కాపరులు లూకా 2:20

## యేసును గూర్చిన ప్రవచనాల నెరవేర్పు

లూకా 1:31-33

1. స్త్రీ గర్భమున పుడతాడు ఆదికాండము 3:15

2. కన్యక గర్భమున పుడతాడు యెషయా 7:4

3. దేవుని యొక్క కుమారుడనబడతాడు. కీర్తనలు 2:7

4. అబ్రాహాము వంశస్థుడై ఉంటాడు. ఆది 22:18

5. బెత్లెహేములో పుడతాడు. మీకా 5:2

6. మంచి బహుమానాలతో వస్తాడు. కీర్తన 72:10

7. హేరోదు చేత ద్వేషించబడతాడు. యిర్మీయా 31:15

8. దేవుడు, మనుష్యుడై ఉంటాడు. యెషయా 7:14

9. ప్రవక్తయై ఉంటాడు. ద్వితి 18:18, యాజకుడై ఉంటాడు. కీర్త 110:4, న్యాయాదిపతియై ఉంటాడు. యెషయా 33:22, మరియు రాజై ఉంటాడు. కీర్త 2:6.

10. ముందుగా ఒక దూత వచ్చి ప్రకటిస్తాడు. మలాకి 3:1

11 మొదటిగా గలలియాలో బోదిస్తాడు. యెషయా 9:1

12. ఎన్నో అద్భుతములు చేస్తాడు. యెషయా 35:5,6

13.అతడు సర్వోన్నతుని కుమారుడనబడును ఆది. 14:18-22 కీర్తన 7:17, 18:13

14.అతడు తన తండ్రియైన దావీదు సింహాసనాన్ని స్వతంత్రించుకొనును 2సమూ. 7:16, దాని. 7:13,14




**యే**సుక్రీస్తు ప్రభువు కృప ద్వారా మన జీవితంలో మరియొక క్రిస్మస్‌ను ఆనంద సంతోషములు కలిగి నిత్య దేవుని ఆరాధించుటకు తరుణము అనుగ్రహించిన దేవునికి స్తోత్రములు.

### దేవుని ప్రేమ :

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. (యోహాను 3:16) క్రీస్తు నందు విశ్వాసముంచుటకు దేవునిప్రేమ నీ యెడల కనుపరచెను. మనమింకను పాపంలో వున్నపుడే క్రీస్తు మన కోసం జన్మించాడు. క్రీస్తునందు విశ్వాసం వుంచి నూతన జన్మ పొంది ఆయనతో యుగయుగాలు జీవించాలని ఆయన సంకల్పం.

దేవుడు తన అద్వితీయ కుమారుని ఈ లోకములో జన్మింపజేయుటకు ఆయన సంకల్పములో ఐదుగురిని యేర్పాటు చేసికొనియున్నాడు. కన్యయైన మరియ, నీతిమంతుడైన యోసేపు, దేవదూతలు, గొర్రెల కాపరులు, తూర్పుదేశపు జ్ఞానులు. పైన చెప్పబడిన ఐదుగురు ఎట్టి పరిస్థితులలోనైనను దేవుని చిత్తము నేరవెర్చుటకు దేవునికి విధేయులై యున్నారు. ఈ క్రిస్మస్ సందేశమునందు ఐదుగురిలో ఒక్కరైనా యోసేపును గురించి ధ్యానించెదము.

### యోసేపు :

నీతిమంతుడైన యోసేపు, కన్యయైన మరియ దావీదు రాజు యొక్క వంశమునకు చెందినవారు. తరములు మారుచు యుండగా వీరి కుటుంబములు పేదరికములోనికి వచ్చెను. యోసేపు మరియకు కాబోయే భర్త. మరియకు కలగబోయే అవమానాన్ని తలంచాడు. వారి ప్రదానాన్ని రద్దు చేసుకోవాలనుకున్నాడు.

మరియ గర్భము ధరించిన విషయములో యోసేపు అనుమానము, కలవరము, భయము, నింద, దిగులు– విచారముతో దేవుని సన్నిధిలో ప్రార్థించు చుండగా దేవుడు తన ప్రార్థనాలకించి దూత ద్వారా ఆదరణ వర్తమానము పంపియుండెను. "దావీదు కుమారుడవైనా యోసేపు మరియను భార్యగా చేసుకోడానికి భయపడవద్దు. పరిశుద్ధాత్మ వలన ఆమె గర్భం ధరించింది. ఆమె ఒక కుమారుని కంటుంది. ఆయనకు యేసు ("రక్షకుడు") అని పేరు పెడతారు. ఆయనే తన ప్రజలను

పాపముల నుండి విడిపించేవాడు". యోసేపు దేవుని చిత్తమునకు విధేయుడగుట వలన యేసు నామమున రక్షకుని, ఇమ్మానుయేలు నామమున దేవుని తోడని తెలిసికొనెను.

**ఇమ్మానుయేలు (God with us) :**

దేవుడు అన్ని పరిస్థితులలో యోసేపునకు తోడుగా ఉండి ధైర్యపరచాడు. దేవుడు మన జీవితములో కూడా యే విధముగా తోడై ఉండి, ఆయన మనకు చేసిన కార్యములను, లేఖనముల నుండి ఏడింటిని ధ్యానించి క్రిస్మస్ సంతోషమిచ్చిన దేవుని స్తుతించెదము.

**1. ఇమ్మానుయేలుగా యేసుక్రీస్తు ప్రభువు మన పాపములను భరించెను (Our sin bearer) :**

1 పేతురు 2:24 ప్రకారము మన పాపములకు క్రీస్తుప్రభువు తానే తన శరీరమందు శిక్ష పొంది మన పాపములను మ్రాను మీద మోసెను. సిలువపై ఈ కార్యము మనలను ప్రేమించి మన యెడల చూపిన దేవుని కృపా కార్యము. మన అతిక్రమ క్రియలను బట్టి ఆయన గాయములు పొందాడు. ఆయన పొందిన గాయముల ద్వారా మనకు స్వస్థత. ఆయన వద్దకు వచ్చిన వారందరూ స్వస్థత పొందారు.

**2. మన ప్రధాన యాజకుడు(Our high priest) :**

హెబ్రి 2:7 ప్రధాన యాజకుడు ప్రజల పాపములకు పరిహారముగా దేవునికి బలులనర్పించి దేవునితో సమాధాన పరచుటకు దేవుని సముఖములో నిలుచును క్రీస్తు ప్రభువు తన స్వరక్తముతో మనలను దేవునితో సమాధానపరచెను. (హెబ్రి 9:12).

**3. మన మధ్యవర్తి(Our Mediator) :**

1 తిమోతి 2:5 క్రీస్తుయేసు నరుడుగా మనకు మధ్యవర్తిగా యుండి తన ద్వారా దేవుని యొద్దకు వచ్చు వారి పక్షమున విజ్ఞాపన చేయుటకు నిరంతరము జీవించు చున్నాడు. (హెబ్రి 7:25).

**4. మనకు నీతియైయున్నాడు (Our Righteousness):**

విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకు అనీతి మంతులమైన మన కొరకు క్రీస్తు సిలువ మరణము నొందెను- నమ్ముట వలన నీతిమంతులము కాగలము. రోమా 10:4; 3:10;24,25.

**5. మన విమోచకుడు (Our Redeemer) :**

క్రీస్తుయేసు మనలను ధర్మశాస్త్రము యొక్క శాపముల నుండి విమోచించెను - యిప్పుడు క్రీస్తుయేసు నందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు. (గలతి 3:13) (రోమా 8:1) ఆదాము యొక్క పాప, మరణముల నుండి విమోచించెను.

**6. మన రక్షకుడు(Our Saviour) :**

క్రీస్తు సిలువబలిద్వారా సాతాను యొక్క నరకము నుండి మనలను రక్షించెను. (లూకా 2:11) క్రీస్తుయేసు నందు నిత్యజీవమునకు- మహిమగల జీవితమునకు రక్షించెను. యిందు కొరకు క్రీస్తు ప్రభువు సిలువలో క్రయమును చెల్లించెను.

**7. మన మంచి కాపరి(Our Good Shepherd) :**

(యోహాను 10:11) మంచి కాపరిగా ప్రభువు గొర్రెల కొరకు సిలువలో తన ప్రాణము పెట్టెను - మంచి కాపరిగా మనలను నడిపించును, రక్షించును, అక్కరలు తీర్చును. అయన తన గొర్రెలను ఎరుగును. అవి ఆయన స్వరము విని ఆయనను వెంబడించును.

**ముగింపు :**

యేసు అనగా తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించువాడు, క్రీస్తు అనగా అభిషక్తుడు, ఇమ్మానుయేలు అనగా దేవుడు మనకు తోడుగాను యున్నాడు. ఆ దేవునియందు మనము విశ్వాసముంచి పాపక్షమాపణ నొంది నూతన క్రిస్మస్ దీవెనలు ఆనంద సంతోషములు పొందుటకు ప్రభువు కృప చూపును గాక.

మహిళా స్పందన

# క్రిస్మస్



శ్రీమతి లిల్లీ భాస్కర్

ఈ నూతన సహస్రాబ్దిలో 2008 వ. సంవత్సరము డిశెంబరు నెలలో క్రిస్మస్ సంతోషానంద అనుభూతితో సందర్శించి కనుమరుగవబోతుంది. గనుక ఈ సంవత్సరము వయస్సులో, జ్ఞానములో, చదువుల్లో, పదవుల్లో, శారీరకంగా, మానసికంగా, సాంఘికపరంగా ఎంత ఎదిగామో, ఆధ్యాత్మికంగా ఎంత ఎదిగామో పునః ర్విమర్శ చేసికొని నూతన సంవత్సరములోనికి ప్రవేశిద్దాము.

క్రిస్మస్ పండుగ జరుపుకోడానికి డిశెంబరు 25న క్రీస్తు పుట్టాడా లేదా అనే ప్రశ్న కొద్దిమందిలో తలెత్తినా అనేక మంది డిశెంబరు నెలారంభము నుండి క్రిస్మస్ సందడిలో మునిగి పోతారు. సంవత్సరానికి ఒక్కసారి వచ్చే ఈ పండుగ క్రైస్తవుల్లో ముఖ్యముగా నిరాశ నిస్పృహలో ఉన్న వారికి సంతోషానందాల్ని, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తుంది. ఎంత నిరుపేదలైనా యేసు జన్మించాడనే ఆనందంతో చర్చికి వెళ్ళి యేసును ఆరాధిస్తారు. ఉన్నవారైతే ఇంటి,వంటి అలంకంణలతో పాటు పిండివంటలు, విందు భోజనాలు ఓహో ఒకటేమిటి ఉల్లాస ఆనందాలతో పరవశించిపోతారు.

ప్రియులారా యేసు సర్వోన్నతుడైన దేవుని కుమారుడై యుండి పొత్తిగుడ్డలలో చుట్టబడి పశువుల తొట్టెలో పండుకొని యందుట ఆశ్చర్యముగా ఉంది కదూ. యేసు పుట్టినపుడే రాజుగా జన్మించుట మరీ ఆశ్చర్యముగా ఉంది. ఆయన ఒక కన్యకు పుట్టుట మరీమరీ ఆశ్చర్యం. కాని ఇది పరమసత్యం. దీన్ని కాదనే ధైర్యం లోకంలో ఎవరికీ లేదు. మన జీవితాల్లో కూడ ప్రతి దినం ఎన్నెన్నో ఆశ్చర్యకార్యాలు చేసి ముందుకు నడిపిస్తున్నది ఆశ్చర్యకరుడైన ఆ యేసే.

పాత నిబంధన కాలంలో క్రీస్తు పుట్టుకకు 740 సంవత్సరములకు పూర్వమే "ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడు"నని, ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని ప్రవక్తయైన యెషయా (9:6) ప్రవచించెను.

యెషయా రాసిన తరువాత కొన్ని వందల సంవత్సరాలకు ఈ ప్రవచనం నేరవేరింది. బానిసత్వం అనే కాడి ఎవరి మూలంగా తొలగి పోతుందో ఎవరు నిజమైన శాంతిని ఇస్తారో, గలలియ ప్రాంతాల్లో ప్రకాశించనున్న ఆ గొప్ప కాంతి ఎవరో ఆయన్ని ఈ వచనంలో చూస్తున్నాము. యేసు ప్రభువులో మానవత్వం, దైవత్వం రెండూ చూడగలము. ఆయన మహా బలిష్టుడైన దేవుడు అయినప్పటికి చిన్న శిశువుగా జన్మించాడు. పెరిగి యూదులకు రాజుగా ప్రపంచానికే రారాజుగా నిలిచాడు.(యిర్మియా 23:5, మత్తయి 2:2; 27:11; 28:18, ప్రకటన 19:16)

యేసు ప్రభువు స్వభావంలో, గుణాల్లో, కార్యాల్లో, పవిత్ర జీవితంలో మరణం నుండి సజీవునిగా లేవడంలో, ఆరోహణంలో ఆశ్చర్యకరుడే. మనం తెలుసుకోవల్సిన, చెయ్యవల్సిన అన్ని విషయాల్లోను అనంత జ్ఞానియైన ప్రభువు ఆలోచన చెప్పి నడిపించగలడు. నిత్యుడగు తండ్రి శాశ్వత జీవాన్ని కలిగిన తండ్రి మనకూ శాశ్వత జీవాన్నిచ్చి నడిపించేవాడు. మనుష్యులకు, దేవునికి మధ్య ఘనుడైన శాంతిదూత తన శాంతిని సమాధానాన్ని మనకిచ్చేవాడు.

సర్వశక్తిమంతుడు, సర్వోన్నతుడు, సార్వభౌముడైన యేసు జన్మించినపుడు మరియ యోసేపులతో పాటు దూతలు, గొల్లలు, జ్ఞానులు, అన్న సుమేయోను, ప్రజలందరు ఎంతో సంతోషించిరి.

జ్ఞానులు తూర్పు దిక్కున నక్షత్రమును చూచి అత్యానంద భరితులై ఆ నక్షత్రమును బట్టి రక్షకుడు ఎక్కడ పుట్టాడో అన్వేషించుటకై రాత్రనక, పగలనక, ఎండలో, వర్షంలో, శ్రమలు సహించి, కష్టాల వోర్చి, కుటుంబాలను విడిచి ఆ ప్రాంతాన్ని కనుగొని, యింటిలోనికి వచ్చి తల్లియైన మరియను, యోసేపును, ఆ శిశువుని చూచి భయభక్తులు, వినయ విధేయతలతో, యదార్ధమైన హృదయముతో సాగిలపడి, పూజించి, తమ పెట్టెలు విప్పి బంగారము, బోళము, సాంబ్రాణి ప్రశస్తమైన కానుకలు సమర్పించిరి(మత్తయి 2:10-12).

జ్ఞానములేని చదువుకోని గొర్రెల కాపరులు దూత తెల్పిన మహాసంతోషకరమైన వర్తమానము విని మనము బేత్లేహేము వరకు వెళ్ళి ఆయన్ని చూతము రండని ఒకరితో ఒకరు చెప్పుకొని త్వరగా వెళ్ళి మరియను, యోసేపును, తొట్టెలో పడుకొని యున్న శిశువుని చూచి, ఈ శిశువుని గూర్చి తమతో చెప్పిన మాటలను ప్రచురము చేసిరి. గొర్రెల కాపరులు వారు విన్న వాటిని కన్న వాటిని గూర్చి దేవుని మహిమ పరచిరి (లూకా 2:8-12, 15-20).

పరలోక సైన్య సమూహము కూడ దూతతో కూడ నుండి సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయన కిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానమును కలుగు గాకని దేవుని స్తుతించిరి (లూకా 2:13,14).

తూర్పు దేశపు జ్ఞానులు, గొర్రెల కాపరులు, పరలోక సైన్య సమూహము మార్గదర్శకులుగా మన ముందు నిలిచిరి. అట్టి అనభవమును కలిగి యున్నప్పుడే నిజమైన క్రిస్మస్ ఆనందాన్ని నీ సొంతం చేసికొనగలవు.

క్రొత్త నిబంధన ప్రకారం ఆ యేసే న్యాయాధిపతిగా తిరిగి రానై యున్నాడు. మొదటి రాకడలో శిశువుగా జన్మించి తన ప్రజలను రక్షించు కొనుటకు తన ప్రాణాలర్పించాడు. రెండవ రాకడలో తీర్పు చెప్పి తన బిడ్డలైన వారికి నిత్యజీవము, నిత్యరాజ్యము, నిత్యానందము అనుగ్రహించును. నమ్మిన వారు ధన్యులు.

ప్రియులారా మన బిడ్డలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా పట్టారో, పుట్టినప్పటి నుండి వారి పోలికలు, చిలుక పలుకలు, ముద్దు ముచ్చట్లు మురిపెముగా మన ప్రియులతో చెప్పుకోవడం మనకు అలవాటు. మరి మన ప్రియ రక్షకుని జన్మం గురించి ఆయన చేసిన ఆశ్చర్యకార్యాల గురించి, చూపిన ప్రేమ గురించి, చేసిన త్యాగాన్ని గురించి రెండవ రాకడలో ఏమి చేయనైయున్నాడో ఎంతమందికి తెలియపర్చాము ఒక్కసారి జ్ఞాపకము చేసికొందామా? లేక విష్ యు హ్యాపి క్రిస్మస్, విష్ యు మేరి క్రిస్మస్ అంటూ సంబర పడిపోతూ సంతృప్తి పడదామా?

ప్రియ సోదరీ సోదరుడా దేవుడు ఈ లోకానికి ఎవరిని ఊరికే పంపడు. యేసు అనగా రక్షకుడు కదా. మరి ఆ రక్షణ కార్యము నేరవేర్చుట ద్వారా తండ్రి చిత్తాన్ని నెరవేర్చాడు. మరి నిన్ను ఎందు నిమిత్తము పంపాడో తెలుసుకొని, నీ సమయాన్ని, తరుణాన్ని నిరర్ధకము చేయక ఆయన చిత్తాన్ని నేరవేర్చే బిడ్డగా ఉంటావా? క్రిస్మస్ సందర్భముగా యేసు ప్రేమని ఇతరులతో పంచుకో.

బాలస్పందన

# కీర్తన

పి.సురేశ్

**పిల్లలూ** బాగున్నారా! వచ్చేస్తుంది, వచ్చేసింది క్రిస్మస్! ఇక సండేస్కూలు పిల్లలదే హడావుడి అంతా. కేరల్స్, డ్యాన్సులు, స్కిట్‌లు, గిఫ్ట్‌లు ఒకటేమిటి అంతా మీదే .సరే ఈ రోజు ఒక సండేస్కూల్ కథ చెప్పుకుందాం. అనగనగా ఒక ఊరు. ఆ ఊరు పేరు దేవపురం. ఆ ఊరిలో ఒక చిన్న చర్చి ఉంది. ఆ చర్చిలో ప్రతి ఆదివారం ఉ॥ 8 గంటలకు సండేస్కూల్ జరుగుతుంది. ఆ సండేస్కూల్‌కు మీలాగే అనేకమంది పిల్లలు వచ్చి బైబిల్ వాక్యాలు, పాటలు, ఆటలు నేర్చుకుంటారు. పాటలు పాడే వారిలో బాగా పాడగల ఒక పాప ఉంది. ఆ పాప పేరు కీర్తన. కీర్తన సండేస్కూల్ లో పాటలు నేర్చుకుని చర్చిలో, వారి ఇంటి దగ్గర పాడుతుంటే అందరూ చాలా సంతోషించేవారు. చర్చిలో ఎప్పుడు ఒక ప్రత్యేక పాటను కీర్తనకు ఇచ్చేవారు. కొంతమంది వారి ఇంటిలో స్తుతి కూటలు పెట్టుకొని కీర్తనను పాటలు పాడడానికి ప్రత్యేకంగా పిలిచేవారు. "దేవుడు ఎంతో మంచిస్వరం నీకు ఇచ్చాడమ్మా". అని అందరూ మెచ్చుకునేవారు.

ఆ ఊరిలో ఆనందరావు గారు అనే పెద్దమనిషి ఉన్నాడు. ఆయన గొప్ప ధనవంతుడు. పాస్టరుగారు ఆ ఊరిలో అందరికి యేసును గురించి చెప్పేవారు. ఈ ఆనందరావు గారికి కూడా చాలాసార్లు యేసు గురించి చెప్పబోతే ఆయన గర్వంతో " యేసు లేదు, యేమి లేదు, నీవు చెప్పేవన్ని అబద్ధాలే. నాకు చెప్పద్దు పో" అని కోపంతో అనేవాడు. పాస్టరు గారు నిరుత్సాహంతో తిరిగి చర్చికి వెళ్లి మోకరించి "తండ్రీ! ఆనందరావు గారి కుటుంబంను జ్ఞాపకం చేసుకోండి. ఈయన ఒక్కడు యేసును తెలుసుకొంటే ఈ ఊరిలో అనేకమంది యేసును గురించి తెలుసుకుంటారు" అని ప్రార్థన చేసేవాడు. ఆ తరువాత కొద్దిరోజులకు ఆనందరావుగారి భార్య రత్నం జ్వరంతో బాధపడుతూ మంచం పట్టింది. ఆనందరావుగారు "ఎంత డబ్బు ఖర్చు అయినా పర్వాలేదు, వ్యాధి నయం కావాలి" అని అనేకమంది పెద్ద పెద్ద వైద్యులకు చూపించినా లాభం లేకపోయింది. వైద్యులకు రోగమేమిటో అర్థం కావటం లేదు. వ్యాధి రోజురోజుకు ఎక్కువై చనిపోయే స్థితివరకు వచ్చింది.

మరి కొద్దిరోజులలో క్రిస్మస్ ఉందనగా సండేస్కూల్ పిల్లలందరు కేరల్స్ మొదలుపెట్టారు. కీర్తన కూడా కేరల్స్‌కు వెళ్తూ చక్కగా అందరి ఇంటిదగ్గర పాడుతుంటే వారి ఇంటి పక్కన వారు కూడా కీర్తనను పిలిపించుకొని పాటలు పాడించుకొని మంచి గిఫ్ట్‌లు ఇస్తున్నారు. కీర్తన బాగా పాడుతుందని ఆ నోట ఈ నోట చివరకు ఆనందరావుగారి భార్య రత్నం చెవిని పడింది. కీర్తన పాటలు వినాలని కోరిక పుట్టింది ఆమెకు. ఆమె తన భర్త ఆనందరావు గారితో " ఏమండి నాకు ఒక కోరిక తీరుస్తారా" అని అడిగింది. వెంటనే "చెప్పు రత్నం నీకు ఏంకావాలో క్షణాల్లో నీ ముందుంచుతాను." అన్నాడు ఆనందరావు. "మన ఊరిలో కీర్తన అనే పాప బాగా పాటలు పాడతుందట. ఆ పాపను ఒక్కసారి మనంటికి పిలిపించండి. నాకు ఆ పాప పాడుతుంటే వినాలని ఉంది." అంది రత్నం. "అంతేకదా! ఆ పాప ఎవరో, ఎక్కడ ఉంటుందో కనుక్కొని ఇప్పుడే పిలిపిస్తాను"

అంటూ బయటకు వెళ్ళాడు ఆనందరావు. రత్నం ముఖంలో కొంత సంతోషం కనిపించింది.

ఆనందరావు గారు కీర్తన కోసం విచారించగా ఆ పాప ఒక క్రైస్తవ కుంటుంబానికి చెందిన పాప అని విని అయిష్టంగా ముఖం పెట్టాడు. అయినా తన భార్య రత్నం మీద తనకున్న ప్రేమను బట్టి చర్చి దగ్గరకు వెళ్ళాడు. అక్కడ పాస్టర్ గారు ఆనందరావుగారు రావటం చూసి "రండి రండి ఆనందరావుగారు! మీరు ఇలా రావడం చాలా ఆనందంగా ఉంది" అని ఆయనను ఆహ్వానించారు. "పాస్టర్‌గారు మీ సండేస్కూల్ లో కీర్తన అనే పాప బాగా పాడుతుందట. దయచేసి నా భార్య కొరిక తీర్చడానికి ఆ పాపను ఒకసారి మా ఇంటికి పంపిస్తారా! ఆ పాప పాట వినాలని నా భార్య రత్నం ఎంతో ఆశపడుతుంది" అన్నాడు. పాస్టర్‌గారు మనస్సులో ఎంతో సంతోషిస్తూ దేవుని స్తుతించి ఆనందరావు గారితో "తప్పకుండా పంపిస్తాను. మీరు వెళ్ళిరండి." అన్నారు.

సాయంత్రం కీర్తన ఆనందరావుగారి ఇంటికి వచ్చింది. ఇంటిలోనికి వెళ్ళగానే అంత పెద్ద ఇంటిని చూసి "ఎంత పెద్ద ఇల్లో" అని అనుకుంది. ఇంతలో ఆనందరావుగారు వచ్చి "పాపా నువ్వేనా కీర్తన" అని అడిగారు. "అవును అంకుల్" అంది కీర్తన. నువ్వు బాగా పాడతావట కదా! మరి ఆంటీ దగ్గర మంచి పాటలు పాడతావా" అన్నారు. "ఓ! నాకు చాలా పాటలు వచ్చు మా సండేస్కూల్ లో నేర్చుకున్నా. అంకుల్, ఆంటీ ఎక్కడ" అంది కీర్తన. ఆనందరావుగారు కీర్తనను రత్నంగారు ఉన్న గదిలోనికి తీసుకొని వెళ్ళారు. కీర్తనను చూసి చూడగానే రత్నం గారు ఎంతో సంతోషించింది. కీర్తన పాడడం మొదలు పెట్టింది

**నాలో యేసు ఉన్నాడు నాకు భయమేలేదు ఎప్పుడూ సంతోషమే**

**1. చేర్చుకున్నాడు నన్ను చేర్చుకున్నాడు తన బిడ్డగా నన్ను చేర్చుకున్నాడు. ॥నాలో॥**

**2. స్వస్థపరచాడు నన్ను స్వస్థపరచాడు తన గాయములతో నన్ను స్వస్థపరచాడు. ॥నాలో॥**

అంటూ పాడుతూ ఉండగా రత్నంగారు "ఆగాగు.." అంది. కీర్తన పాట ఆపి రత్నంగారివైపు చూసింది. రత్నంగారు ఆశ్చర్యంగా "ఏంటి స్వస్థపరచాడని పాడుతున్నావు. యేసు తన గాయాలతో స్వస్థపరచడమేమిటి "అని ప్రశ్నించింది. కీర్తన వెంటనే తడుముకోకుండా "అవును ఆంటీ యేసు ఏంతో మందిని స్వస్థపరచాడు. కుంటివారిని, గ్రుడ్డివారిని, చనిపోయినవారిని కూడా లేవనెత్తాడు. మనం కూడా యేసయ్యను ప్రార్థిస్తే మనలను స్వస్థపరుస్తాడు."అంది. అంతే వెంటనే రత్నం "మరి నేను ప్రార్థించినా నన్ను యేసు స్వస్థపరుస్తాడా" అని ఆశగా అడిగింది "ఓ! తప్పకుండా స్వస్థపరుస్తాడు" అంది కీర్తన. అయితే ఈ రోజంతా యేసుకు ప్రార్థనచేస్తా అంది రత్నంగారు. కీర్తన తిరిగి వెళ్ళి జరిగిందంతా సండేస్కూల్ మాస్టారుగారికి, పాస్టర్‌గారికి చెప్పింది. వారంతా విని ఎంతో సంతోషించి దేవుని స్తుతించి వెంటనే అందరూ మోకరించి, రత్నంగారి కొరకు ప్రార్థించారు. ఆ రోజంతా రత్నంగారు కూడా ప్రార్థించారు.

వారం రోజులు గడిచాయి. ఆనందరావుగారు మరల కీర్తనను ఇంటికి పిలిపించుకున్నారు. కీర్తన తిన్నగా రత్నంగారు ఉన్న గదిలోనికి వెళ్ళింది. కాని అక్కడ మంచంమీద రత్నంగారు కనిపించలేదు. ఇంతలో "వచ్చావా కీర్తనా" అంటూ ఎవరిదో స్వరం తన వెనుకగా వినిపించింది కీర్తనకు. వెనక్కు తిరిగి చూసేసరికి రత్నంఆంటీ. ఆశ్చర్యం ఆంటీ చక్కగా నడుస్తుంది. "ఆంటీ మీకు జ్వరం తగ్గిపోయిందా!" అంది కీర్తన. "అవునమ్మా ఆంటీకి పూర్తిగా తగ్గిపోయింది. నీవు చెప్పావు కదా! ప్రార్థన చేసుకోగానే యేసు ఆంటీని స్వస్థపరచాడు." అంటూ ఆనందరావుగారు అక్కడకు వచ్చి "ఇకనుండి మేమంతా కూడా చర్చికి వస్తాము". అన్నారు. కీర్తనకు ఎన్నో గిఫ్టులుకూడా ఇచ్చారు.

చూశారా పిల్లలు! దేవుడు పిల్లలను కూడా తన పనిలో ఎంత బాగా వాడుకుంటాడో. మరి మీరుకూడా సండేస్కూల్‌లో బాగా పాటలు, వాక్యాలు ఇలా అన్నీ నేర్చుకుంటే దేవుడు మిమ్ముల్నుకూడా వాడుకుంటాడు.

రేడియో పాఠం

# నిర్గమ కాండము



ఆచార్య ఆరార్కే

*(గత సంచిక తరువాత)*

ఇంత వరకు దేవుడు మానవ ప్రాణాన్ని ముట్టలేదు. ఇప్పుడు దేవుడు జ్యేష్ఠకుమారులను హతం చేస్తున్నాడు. అయితే దేవుడు హంతకుడా ? అట్లనరాదు. దేవుడు ప్రాణం ఇవ్వగలడు. ప్రాణం తీసివేయగలడు. ఆయనకే మహిమ ప్రభావములు కలుగును గాక ! ప్రాణాన్ని సృజించిన దేవునికి దానిని తీసివేయటానికి కూడ అధికారం ఉన్నది.

ఇశ్రాయేలీయులను ఈజిప్టు నుండి ఫరో వెళ్ళగొడుతున్నాడు. అర్ధరాత్రి జరిగిన సంఘటన ! ఈజిప్టు దేశంలో ప్రతి కుటుంబంలో జ్యేష్ఠ కుమారుడు పశువులలో తొలి చూలు హతం అయిపోవటం జరిగింది. ఆ రాత్రివేళ ఫరో మోషే అహరోనులను పిలిపించి వారితో అన్నాడు. మీరు ఇశ్రాయేలీయులు, లేచి నా ప్రజల మధ్య నుండి వెళ్ళిపోండి. మీరు చెప్పినట్లు పోయి యెహోవాను సేవించండి. మీరు చెప్పినట్లు మీ మందలను, మీ పశువులను, తీసికొనిపోండి. నన్ను దీవించండి.” ఎట్టకేలకు ఫరో పట్టు విడిచాడు. అయితే ఈ చిట్టచివరి తెగులుతో అతని జ్యేష్టకుమారుడు చచ్చాడు. దేవుడు ఫరోతో తలపడి యుద్ధం చేస్తూ వచ్చాడు. అహరోను కర్రను పాముగా మార్చాడు. మొదట్లోనే ఫరో దేవుని మాటలు నమ్మి ఉంటే ఇశ్రాయేలు ప్రజలు తమ పిల్లలతో సహా అప్పుడే వెళ్ళిపోయి ఉండేవారు. ఇంతవరకు వచ్చేది కాదు. ఈ ఘోరానికి కారణం దేవుడు కాదు. ఫరో మొండితనమే.

ఈజిప్టు దేశీయులు మన మందరము చచ్చిన వారము అనుకొని తమ దేశంలో నుండి ప్రజలను పంపటానికి త్వరపడి వారిని బలవంతం చేశారు. కాబట్టి ప్రజలు తమ పిండి ముద్దను తీసుకొని అది పులియక మునుపే పిండి పిసికే తొట్లతో దానిని మూట కట్టుకొని తమ భుజాల మీద పెట్టుకొనిపోయారు. ఈజిప్టు వారికి ఏమి అర్ధం కావటం లేదు. ఈతీర్పు ఎంతవరకు పోతుందో తెలియదు. దేవుడు వారి జ్యేష్ఠకుమారులను తీసుకొన్నాడు. ఆ తరువాత ఆయన ఏమి చేస్తాడో ! ఒక వేళ ఈజిప్టు దేశస్తులందరికి మరణం ప్రాప్తిస్తుందేమో అందుచేత ఆలస్యం చెయ్యకుండ వెళ్ళిపోండి అంటున్నాడు. ఇశ్రాయేలీయులు మోషే మాట చొప్పున చేసి ఈజిప్టు దేశీయుల వద్ద వెండి నగలను, బంగారు నగలను, వస్త్రములను అడిగి తీసుకొన్నారు. దేవుడు ఈజిప్టు దేశీయుల మనస్సు మార్చాడు. వారు అడిగింది ఈజిప్టు వారు వెంటనే ఇచ్చేశాడు. వారు చేసిన చాకిరీకి రావలసిన జీతం అడిగి పుచ్చుకున్నారు. ఇశ్రాయేలు ప్రజలు ఎంతో ఈజిప్టు ధనాన్ని తీసుకొని మరీ వెళ్ళారు. యెహోవా ప్రజల ఎదుట ఈజిప్టు దేశీయులకు కటాక్షం కలుగచేశాడు. గనుక వారు వారికి కావలసిన వాటిని ఇచ్చారు. ఆలాగ వారు ఈజిప్టు వారిని దోచుకున్నారు.

సోదరీ సోదరులారా ! వింటున్నారా ? ప్రియపాఠకులారా ! ఈ అధ్యాయం ఎంతో రసవత్తరమైనది. దేవుడే కొన్ని పండుగలను ఇశ్రాయేలు జాతికి ఇచ్చాడు. గత చరిత్రలో దేవుడు తమ జాతికి చేసిన మహోపరకారాన్ని పస్కా పండుగ జ్ఞాపకం చేస్తుంది. వృద్ధులకు జ్ఞాపకాలు. కానీ యువకులకు అవి అనుశవాలు పండుగ అంటే సెలవు దినము మాత్రమే కాదు. అది చరిత్రాత్మకమైన పర్వ దినం హెబ్రీయులు గొర్రెపిల్లను ఎందుకు వధించారు ? ప్రతి కుటుంబము గొర్రెపిల్లను చంపినప్పుడు చావవలసిన జ్యేష్ఠకుమారునికి ప్రతిగా దానిని బలి ఇస్తున్నట్లు గ్రహించారు. జ్యేష్ఠకుమారుడు బ్రతుకుతున్నాడంటే అతనికి బదులుగా ఒక నిష్కళంకమైన గొర్రె పిల్ల బలి అయింది అని అర్ధం. పస్కా

పండుగను ప్రతిసంవత్సరం యూదులు ఆచరిస్తారు. ఆసమయంలో వారు జ్ఞాపకం చేసుకునే వాస్తవం ఇదే. మరణ దూత గొర్రెపిల్ల రక్తాన్ని చూసి ఆ ఇంటిలోని జ్యేష్ఠకుమారుణ్ని చంపకుండ దాటిపోయాడు. దేవుని ఆజ్ఞప్రకారం వారు తమ ఇండ్ల ద్వారబందాలకు గొర్రెపిల్ల రక్తం పూశారు. ఏ ఇంటి ద్వారబంధానికి గొర్రెపిల్ల రక్తం లేదో ఆ ఇంటిలోని జ్యేష్ఠకుమారుణ్ని మరణ దూత సంహరించాడు. గొర్రె పిల్లను ఎందుకు చంపారు ? ఇంటి ద్వారా బంధాలకు కమ్ములకు రాయటానికి గొర్రెపిల్ల రక్తం కావాలి. ఇది యేసుక్రీస్తు రక్తాన్ని జ్ఞాపకం చేస్తుంది. తమ ఇండ్లలో అందరూ పస్కా భోజనం తినాలి. పులియని రొట్టెలు త్వరగా చేయవచ్చు. పిండి పులవదు. పొంగదు. వారు ప్రయాణానికి సిద్ధమై ఉన్నారు. పస్కా భోజనంతో పాటు వారు చేదుకూరలు నమిలారు. దాస్యజీవితం ఎంతో చేదో ఇది సూచిస్తున్నది. ఈరోజున కూడ హీబ్రూప్రజలు సంవత్సరాదినాడు అనగా అబీబ్ నెలలో మార్చి ఏప్రిల్ మధ్యలో పస్కా పండుగను జరుపుకుంటారు. వారు ప్రయాణానికి అవసరమైన బట్టలు చకా చకా వేసుకున్నారు. ఇది వారి విశ్వాసాన్ని సూచిస్తుంది. వారి సిద్ధపాటు వారి విశ్వాసాన్ని రుజువు చేస్తున్నది.

ప్రతి సంవత్సరము యూదులు పస్కా పండుగ జరుపుకుంటారు. ఆ సమయంలో దేవుడు తమకు అనుగ్రహించిన విమోచన, ఈజిప్టు నుండి తమను దేవుడు నడిపించిన విధానం జ్ఞాపకం చేసుకుంటారు. సంహార దూత ఏ విధంగా తమ ఇండ్లను దాటిపోయాడో, ఇండ్ల ద్వార బంధానికి కమ్ములకు, రక్తం వారి విమోచనకు ఏలా అవసరమైందో, చరిత్రలో దేవుడు ఎలాంటి అద్భుత కార్యం జరిగించాడో జ్ఞాపకం చేసుకుంటారు. దాస్యం నుండి, పాపము నుండి దేవుడు తమకు ప్రసాదించిన విముక్తి ఎంతో అమూల్యమైనది. అలాగే ఈరోజున విశ్వాసులు తమను యేసు ప్రభువు రక్షించిన రోజును, తమ ఆధ్యాత్మిక జన్మదినాన్ని, జ్ఞాపకం చేసుకుంటారు. ప్రభు రాత్రి భోజనం పాతనిబంధన పస్కా భోజనానికి క్రొత్త నిబంధన చెప్పే అర్థం, చేసే వ్యాఖ్యానం, ప్రభు రాత్రి భోజనం మన నూతన జీవాన్ని పదే పదే మనకు జ్ఞాపకం చేస్తుంది. మనకు పాపం నుండి ఆధ్యాత్మిక దాస్యం నుండి విడుదల ప్రసాదించినవాడు ప్రభువైన యేసుక్రీస్తు. సోదరీ సోదరులారా మనకు శోధనలు వచ్చినప్పుడు, శ్రమలు సంప్రాప్తమైనప్పుడు, ఆధ్యాత్మికమైన పస్కా అయిన యేసుక్రీస్తు మనకు ఎంతో ఆదరణ కలిగిస్తాడు. గతంలో దేవుడు మనకు అనుగ్రహించిన విమోచన, ఇకముందు కూడ ఆయన మనలను కాపాడతాడు అని హామి ఇస్తుంది.

ఈజిప్టు దేశీయుల కుటుంబాలలో హాహాకారాలు చెలరేగాయి. అయితే ఇశ్రాయేలు కుటుంబాలలో క్షేమమూ, భద్రతా ఉన్నాయి. ఏ ఇంటి ద్వారాబంధానికి గొర్రెపిల్ల రక్తం ఉందో, వారికి రక్షణ ఇది విమోచన గాథ. ప్రజలకు ఇదొక పాఠం. దేవుని వాక్యం మొత్తంలో ఇదే ముఖ్యమైన అంశం. పాప దాస్యం నుండి మనుష్యులందరికి విమోచన కావాలి. మానవులందరూ పాపులు. పాపం నుండి దాని దుష్ఫలితాల నుండి మనలను మనం రక్షించుకోలేము. మనకు విమోచకుడు కావాలి. విమోచన అనగా విమోచన క్రయధనం చెల్లించాలి. ఈ విమోచన క్రయధనాన్ని మన పక్షాన చెల్లించే వ్యక్తి కావాలి. మన కోసం పాప శిక్షను భరించే వ్యక్తి కావాలి. ఒక గొర్రె పిల్ల కుటుంబంలోని జ్యేష్ఠకుమారునికి ప్రత్యామ్నాయంగా వధించబడింది. పాతనిబంధనలో పాపక్షమాపణకు గుర్తుగా బలిపశువు వధించబడింది. దాని ద్వారా పాపక్షమాపణ, పాప పరిహారం, మొదలైనవి చేకూరుతాయి. ఒక మంచి గొర్రెపిల్ల ఏలోపంలేనిది. బలి పశువుగా అర్పించబడుతుంది. క్రొత్త నిబంధనలో యేసుక్రీస్తు సిలువ మీద సంపూర్ణబలి అర్పించాడు. తానే మన పాపాల కోసమై బలి పశువు అయ్యాడు. యేసుబలి తరువాత జంతుబలులన్ని రద్దు అయిపోయాయి. యేసు మన కోసం ప్రత్యామ్నాయబలి. I పేతురు 1:18, 19 పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా, వెండి బంగారముల వంటి క్షయవస్తువులచేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తం చేత అనగా నిర్దోషమును, నిష్కళంకమును అయిన గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తం చేత విమోచింపబడ్డారు. అని మీరు ఎరుగుదురు కదా ! సోదరీసోదరులారా ! ఇది ఎంతో గొప్ప విమోచన. దాస్యం నుండి అనగా పాపం నుండి మనలను విమోచింపగలవాడు యేసుక్రీస్తే.

(ఇంకా వుంది)

పొరుగువారి కోసం...

# సద్గురువు



## దేవుడు లోకాన్ని పరిపాలిస్తున్నాడు

దేవుడు సృష్టికర్త మాత్రమే కాడు. ఆయన సృష్టిని పోషిస్తున్నాడు, పరిపాలిస్తున్నాడు. యేసుక్రీస్తు కొండపై చేసిన ప్రసంగం చదివి చూడండి. దేవుని పరిపాలన, సంరక్షణ ఆ ప్రసంగం నిండా తేటతెల్లంగా కనిపిస్తున్నాయి. "పరలోకం తోడని ఒట్టు పెట్టుకోకూడదు అది దేవుని సింహాసనం, భూమి ఆయన పాదపీఠం" అంటూ యేసుప్రభువు చెప్పాడు. "ఆయన మంచివారికి, చెడ్డవారికి కూడా సూర్యోదయం కలిగిస్తాడు. న్యాయవంతులకు, అన్యాయవంతులకు కూడా వాన కురిపిస్తాడు" అన్నాడు. దేవుడు తన ప్రజల అక్కర ఎరుగును, వారి ప్రార్థనలకు జవాబిస్తాడు. పక్షులకు ఆహారమిస్తాడు. అడవి పువ్వులను అందంగా అలంకరిస్తాడు. పక్షులకంటే పువ్వులకంటే తన వారి పట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతాడు. దేవునికి తెలియకుండా పిచ్చుక కూడా కింద పడదని చెప్పాడు. అంటే చిన్న సంఘటనలు సహా ప్రభువే జరుగనిస్తున్నాడని భావం. అలాంటప్పుడు పెద్ద విషయాలను దేవుడు చూచుకోకుండా ఉంటాడా?

"స్తుతి పాటలు పాడండి, దేవుని స్తుతి పాటలు పాడండి. సంకీర్తనం చేయండి. మన రాజుకు సంకీర్తనం చేయండి. లోకమంతటికి రాజు దేవుడే. కీర్తన పాడండి. దేవుడు తన పవిత్ర సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. దేవుడు లోకప్రజలను పరిపాలిస్తున్నాడు" అని దేవుని వాక్కులో రాసి ఉంది.

దేవుడు సర్వశక్తి గల రాజు. ఆయన లోకాలన్నిటికీ ప్రభువు, సార్వభౌముడు. అన్నీ ఆయన మహిమగల పాదాల కింద ఉన్నాయి. ఆయన సమస్తాన్ని పరిపాలిస్తున్నాడు. ఆయన లోకాన్ని సృజించి దాన్ని గురించి మరచిపోలేదు. సృష్టిలో ఏదో మూల ఆయన ఒదిగి కూర్చోలేదు. తన సృష్టిని గురించి దేవునికి ఒక నిర్ణయమైన ఉద్దేశం ఉంది. అంతం లేని ప్రభావంతో జ్ఞానంతో ఆయన తన ఉద్దేశాన్ని నెరవేర్చుకుంటున్నాడు.

## ప్రాముఖ్యమైన గొప్ప సత్యం

యేసుప్రభువు దేవుని గురించి చేసిన దివ్యోపదేశాలలో అతి ప్రాముఖ్యమైనదాన్ని ఇప్పుడు నేర్చుకోబోతున్నాం. ఈ సత్యంవల్ల దేవుని లక్షణాలను తెలుసుకోగలం. దేవుడు ఆత్మ. దేవుడు యేసుక్రీస్తులో తనను తాను ప్రత్యక్షం చేసుకొన్నాడు. దేవుడు చేసిన వస్తువుల వల్ల దేవుని గురించిన కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు. "ఆకాశాలు దేవుని మహిమను గురించి చెపుతున్నాయి. విశాలమైన అంతరిక్షం ఆయన చేతులతో చేసిన పనిని తెలియజేస్తూ ఉంది." ఇంతకంటే గొప్ప ప్రత్యక్షం దేవుడు అనుగ్రహించాడు. పరమాత్మ అయిన దేవుడు ఎక్కడా దాక్కోలేదు. దేవుడు దిగివచ్చాడు. తన కుమారునిలో మనుషులకు కనబడ్డాడు.

సద్గురువైన యేసు ఉపదేశాలను బట్టి చూస్తే ఆయన గురువు మాత్రమే కాడు. అంతకు మించినవాడని

రుజువవుతుంది. ఆయన ప్రార్థిస్తూ ఒకసారి ఇలా అన్నాడు. "తండ్రీ, ప్రపంచం ఉనికిలోకి రాకముందు నీతో నాకున్న మహిమ ఇప్పుడు నీ సముఖంలో నాకు మళ్ళీ కలిగించు." జగత్తు సృష్టి కాకముందే యేసుక్రీస్తు ఉన్నాడని దీని అర్థం. మరో సందర్భంలో ఆయన ఇలా అన్నాడు: "నేను, నా తండ్రి ఒకటే." "నన్ను చూచేవారు నన్ను పంపినవాణ్ణి చూస్తున్నారు." "నన్ను చూచినవాడు తండ్రిని చూచినట్టే." యేసు మనుషుల్లో మనిషిగా కనబడ్డాడు. కానీ ఆయన మానవమాత్రుడు కాడు. తాను దేవుణ్ణే అని ఆయన చెపుతున్నాడు. ఆయన భూమిపై జన్మించాడు. ఆయనది నిజమైన మానవ స్వభావం. లోకానికి రాకముందు ఆయనకు దైవస్వభావం ఉంది. భూమిని దేవుడు సృజించకముందు ఆయన తండ్రీతో మహిమలో ఉన్నాడు. అందుకే ఆయన తనను చూస్తే దేవుణ్ణి చూచినట్టే అన్నాడు.

## శత్రువుల వైఖరి

యేసుప్రభు శత్రువులు తాను దేవుణ్ణి అంటున్నాడని గుర్తించారు. "నేను, నా తండ్రి ఒకటే" అన్నప్పుడు యూదులు రాళ్ళు తీసుకొని ఆయనను కొట్టబోయారు. అప్పుడు యేసు "నా తండ్రి నుంచి అనేక మంచి పనులు నేను మీకు చూపాను. వాటిలో ఏ పనికారణంగా మీరు నా మీద రాళ్లు రువ్వుతున్నట్టు?" అని వారినడిగాడు. "మంచి పనికి నీ మీద రాళ్ళు రువ్వం. మేము రాళ్లు రువ్వే కారణం ఏమంటే, నీవు దేవదూషణ చేస్తున్నావు. నీవు మనిషివే అయినా నిన్ను దేవుడుగా చేసుకుంటున్నావు" అని యూదులు ఆయనకు బదులు చెప్పారు.

రెండు వేల సంవత్సరాల క్రితం యేసు కన్య గర్భవాసాన జన్మించాడు. అది ఈ లోకసంబంధమైన ఆయన జన్మం. దేవుడు నా తండ్రి అన్నప్పుడు యేసు ఈ జన్మాన్ని గురించి చెప్పలేదు. ఈ జన్మం ఆయన మానవ స్వభావాన్ని సూచిస్తుందంతే. ఆయన లోకంలో జన్మించకముందు తండ్రి అయిన దేవునితో తనకున్న సంబంధాన్ని తెలియజేస్తూ పైనున్న మాటలు అన్నాడు. "నేను దేవుని శాశ్వతుడైన కుమారుణ్ణి" అని ఆయన భావం. దేవుడు ఎల్లప్పుడూ తండ్రి, క్రీస్తు ఎల్లప్పుడూ కుమారుడు. ఇది నిత్యమైన సంబంధం. అనంతంగా తండ్రి కుమారులు సంపూర్ణ ఏకత్వంలో ప్రేమలో ఉన్నారు.

## దేవునికి కుమారుడు ఉంటాడా?

"దేవుడు పెళ్ళాడుతాడా? ఆయనకు పిల్లలు కలుగుతారా? యేసు దేవుని కుమారుడు అంటే నేను నమ్మను" అని కొందరు అభ్యంతరాన్ని వెలిబుచ్చుతారు. ఈ విధంగా మాట్లాడేవాళ్ళలో కొందరికి బైబిలు సరిగ్గా అర్థం కాలేదని చెప్పవచ్చు. మరికొందరేమో బైబిలు చెప్పేదాన్ని బుద్ధిపూర్వకంగా తారుమారు చేస్తున్నారు. ఆలోచించండి. దేవుడు మనిషి కాడు గదా. కుమారుడు కావలంటే మనిషిలాగా పెళ్ళాడి కనాలా? పరమాత్ముడైన దేవుడు ఆత్మ అయిన కుమారునికి తండ్రి అయివుండడం అసాధ్యమా? దీన్ని మనం మన ఆలోచనలో శరీర సంబంధమైన జన్మంతో ఎందుకు కలపాలి?

మరి కొందరంటారు గదా, "మాకిదంతా అర్థం కావడం లేదు". మీకు అర్థం కాకపోతే ఈ దివ్య సత్యం వాస్తవం కాకుండా పోతుందా? దాన్ని కాదని చెప్పగలరా?

మరో సందర్భంలో కూడా యేసు యొక్క శత్రువులు ఆయన దేవుని కుమారుణ్ణి అని చెపుతున్నట్లు గ్రహించారు. ఒకప్పుడు యేసు "ఇప్పటి వరకు నా తండ్రి పని చేస్తూవున్నాడు, నేనూ చేస్తూవున్నాను" అంటూ వాళ్ళకు ప్రత్యుత్తరం ఇచ్చాడు. ఈ కారణం చేత యూదులు ఆయన్ను చంపాలని ఇంకా తీవ్రంగా ప్రయత్నించారు.

యేసును చంపడానికి చివరకు వారికి దొరికిన కారణం ఇదే. బైబిలు ఇలా వివరిస్తుంది. "ప్రముఖయాజి ఆయనను ప్రశ్నించాడు, 'నీవు దివ్యుడైన దేవుని కుమారుడివా?...' అప్పుడు యేసు 'అవును, నేనే ఆయనను....' ప్రముఖయాజి తన బట్టలు చింపుకొని 'మనకిక సాక్షులతో ఏం పని? ఈ దేవదూషణ మీరు విన్నారు గదా! మీరేమంటారు?' అన్నాడు. 'ఆయన చావుకు తగినవాడ'ని వారంతా తీర్పు చెప్పారు."

(ఇంకా వుంది)

# ప్రార్థన వేదిక

1. వి. జీవరత్నం- ప॥గో॥జిల్లా
సంతానం కోసం
2. యం. అరుణాదేవి- రాజమండ్రి
వ్యాపారం, కుటుంబము కోసం
3. జి. ఎలిజబెతమ్మ- అనంతపూర్
కుటుంబ ఆదరణ కోసం
4.సి. రాజ్‌కుమార్- అనంతపూర్
సంతానం కోసం
5. శ్రీమతి ఎ.కె. పాల్- కర్నాటక
భర్త ఆరోగ్యం కోసం
6. యానీ జోసఫ్- విశాఖపట్నం
కుమార్తె చదువు(టెన్త్) కోసం
7. చెల్లమ్మ చార్లెస్- హైదారబాద్
కుమార్తె భవిష్యత్ కోసం
8. ఎ. మార్తమ్మ- సికింద్రాబాద్
కుటుంబసభ్యుల రక్షణ కోసం
9. లేవీ తిమోతినాయుడు- భీమునిపట్నం
కుడికన్ను స్పష్టత కోసం
10. బి.వి. రావు- గుణదల
కుమారుని రక్షణ కోసం
11. బి. దేవిడ్- వెలుగోడు
సుచరిత,కిరణ్‌లకు సంతానం కోసం
12. బి. ప్రేమలీల- బాపట్ల
కుటుంబ సమస్యల కోసం
13. యం. సురేష్- అనపర్తి
చర్చి నిర్మాణం కోసం
14. జె. విమలరాబర్ట్స్- చిత్తూరు
ఆరోగ్యం కోసం
15. జానేఆనంద్- కర్నూలు
భర్త ఆరోగ్యం కోసం
16. సుదర్శనరావు- హైదారబాద్
కుమారుని వివాహం కోసం
17. యం. జయమణి- రాజమండ్రి
విజయ్‌కుమార్ వివాహం కోసం
18. టి. కుసుమకుమారి- గుంటూరు
భర్త రక్షణ కోసం
19. యి. శారా- హైదారబాద్
భర్త ఆరోగ్యం కోసం
20. కె. పోలమ్మ- అనంతపూర్
కుమారుని మారుమనస్సు కోసం
21. సునీత- హైదారబాద్
సంతానం కోసం
22. డి. జ్యోతి- కొవ్వూరు
అమ్మ ఆరోగ్యం కోసం
23. ఎస్. ధనమ్మ- నంధ్యాల
కుమార్తె ఆరోగ్యం కోసం
24. సువర్ణ- గుంటూరు
భర్త మారుమనస్సు కోసం
25. పి.జి.కె. వినతి- గుంటూరు
కుమారుల ఉద్యోగాలు, వివాహల కోసం
26. కె. అప్పయ్య- విజయనగరం
సేవా పరిచర్య కోసం
27. బి. రాధారాణి- గుంటూరు
విశ్వాస్ చదువు (టెన్త్) కోసం
28. కె. పద్మబాయిమ్మ- కొవ్వూరు
పిల్లల డి.యస్.సి. ఎగ్జామ్స్ కోసం
29. కె. దావీదు- మురికిపూడి
కుటుంబము కోసం
30. జె. ఇందిర- తిమ్మపురం
డి.యస్.సి. ఎగ్జామ్స్ కోసం

## డిశంబర్ గళ్ళ నుడి కట్టు

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు డిసెంబరు 20లోపు, ఇతర రాష్ట్రాలవారు పత్రిక అందిన వారంలోగా మాకందేటట్లు పంపాలి.

పూర్తి చేసి పంపిన వారి పేరు........... ..............

స్పందన కోడ్ ........................................

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | ✠ | ✠ | 3 | | 4 |
| | ✠ | ✠ | | ✠ | 5 | | | ✠ | |
| 6 | | ✠ | 7 | | ✠ | ✠ | | ✠ | |
| | ✠ | ✠ | | ✠ | ✠ | 8 | | 9 | |
| ✠ | 10 | | | ✠ | 11 | | ✠ | | ✠ |
| 12 | | ✠ | ✠ | 13 | ✠ | 14 | 15 | ✠ | ✠ |
| ✠ | 16 | | 17 | ✠ | 18 | ✠ | 19 | | |
| 20 | | ✠ | | ✠ | | ✠ | | ✠ | ✠ |
| | ✠ | ✠ | 21 | 22 | | ✠ | 23 | | 24 |
| 25 | | | ✠ | | ✠ | ✠ | ✠ | ✠ | |

**అడ్డం:**

1. కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి - - - - - - ను పేరు పెట్టును. (యెషయా)
3. ప్రేమ కలిగి యుండుటకు - - - పడుడి. (కొరింథీ)
5. ఇశ్రాయేలీయులు తమ - - - ని స్థాపింప బూను కొనుచు దేవుని నీతికి లోబడలేదు. (రోమా)
6. రక్షకుడని అర్థమిచ్చే పేరు - -
7. మందలు ఆ - - ల యెదుట చూలు కట్టి చారలైనను, పొడలైనను, మచ్చలైనను గల పిల్లలను కనెను
8. పైరు - - - - - ది. కొడవలి పెట్టి కోయుడి. (యోవేలు)
10. సోయరు అనగా అర్థం - - - (ఆదికాండము)
11. విశ్వాసవీరులు కొందరు రంపములతో - - బడిరి. (హెబ్రీ)
12. దేవుడు హతము చేసిన బాషాను రాజు - - (కీర్తనలు)
14. రెండు - - పదములు రిబ్కా కడుపులోనుండి వచ్చునని యోహోవా చెప్పెను.
16. నీ ఆజ్ఞలయందైన అధిక వాంఛ చేత నేను నోరు తెరచి - - - చున్నాను. (తలక్రిందులు) (కీర్తనలు 100-150)
19. బాప్తిస్మమిచ్చు యోహాను తండ్రి - - -
20. ఏలీమునకును సీనాయికిని మధ్యనున్న అరణ్యము - -
21. రిబ్కా సహోదరుని పేరు - - -
23. అహీమెలెకు దావీదునకు - - - ఖడ్గము నిచ్చెను. (తలక్రిందులు)(సమూయేలు)
25. బాలుడు - - - కారునట్లు దయ్యము వానిని విలవిలలాడించుచు గాయపరుచుచు వానిని వదలకుండెను. (లూకా)

**నిలువు:**

1. శిశువు ఎదిగి ఆత్మయందు బలము పొంది, - - - - నకు ప్రత్యక్షమగు దినమువరకు అరణ్యములోనుండెను. (లూకా)
2. 'రాహేలు తన పిల్లల విషయమై - - - - - -'. యిర్మియా ప్రవచనం.
3. నీ - - - - - తో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము. (మత్తయి)
4. సంఘము - - - - - కు స్తంభమని పౌలు తిమోతికి వ్రాస్తున్నాడు.
8. సర్వోన్నతమైన స్థలములలో - - - అని ప్రజలు(యేసుకు) కేకలు వేయుచుండిరి. (తలక్రిందులు)
9. దాసుని స్వరూపమును ధరించుకొని, తన్నుతాను - - నుగా చేసుకొనెను. (ఫిలిప్పీ)
10. చిగురు అను ఒకడు కలడు. అతడు తన స్థలములోనుండి - - - - - (జెకర్యా)
13. అహెష్వరోషు మొదటి భార్య 'వ -'
15. - - - - - లో నుండి మంచిదేదైన రాగలదా అని నతనయేలు ప్రశ్న.
17. షోమ్రోనుకు దేవుడు పెట్టిన పేరు - - - (యెహెజ్కేలు)
18. సమ్సోనును ఫిలిష్తీయులు తమ దేవతయైన - - - గుడిలోనికి తీసుకువెళ్ళిరి.
20. నిత్యము నిలిచే కొండ అని ఈ కొండకు పేరు - - -
22. సుఖారను ఊరిలో యేసు - - దగ్గర కూర్చుండెను.
24. - - వాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన జనమును వేరుపరచును. (మత్తయి)